




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :114 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు ఆదివారం 29 డిసెంబర్ 2024 వెల : 5/-రూ॥


VOLUME :11 ISSUE : 114 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SUN 29 DECEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




# జగన్... మీ వాళ్లను కంట్రోల్ చేసుకో..

## నా సహనాన్ని పరీక్షించవద్దు



- గాలివీడు ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన పవన్
- సిబ్బందికి ధైర్యం చెప్పిన డిప్యూటీ సీఎం
- వైసీపీ నేతలకు స్పష్టమైన వార్నింగ్
- అవసరమైతే కడపలోనే తిష్టవేసి మిమ్మల్ని సరిచేస్తా అంటూ ఫైర్

పెన్ పవర్ డెస్క్:అన్నమయ్య జిల్లా గాలివీడు గ్రామంలో నిన్న ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం తెలిసిందే. జవహర్ బాబు ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇవాళ కడప వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిమ్స్ లో ఎంపీడీవో జవహర్ బాబును పరామర్శించారు.

అనంతరం ఆయన వివరాలు 2లో..



# ముగిసిన మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు...

## 11 కి.మీ మేర సాగిన అంతిమ యాత్ర

## పాడె మోసిన రాహుల్ గాంధీ




- ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్ లో ముగిసిన అంత్యక్రియలు
- సిక్కు సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు
- అంత్యక్రియలకు హాజరైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని

వివరాలు 2లో..

## డిజిటల్ అరెస్ట్ అనేదే లేదు...

# అలాంటి వాటిని ఎవరూ నమ్మవద్దు

- ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ మోసగాళ్ల బెదిరింపులు
- పలువురి నుంచి కోట్ల రూపాయలు వసూలు
- సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్న డీజీపీ
- ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట... డిజిటల్ అరెస్ట్. డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ నేరగాళ్లు పలువురు వ్యక్తులను బెదిరించి కోట్లు కొల్లగొడుతున్న ఘటనలు

ఎక్కువవుతున్నాయి. వివరాలు 2లో..

## తెలంగాణకు తిరుమల షాక్.. సిఫార్సు లేఖపై నిర్ణయం తీసుకోలేదన్న ఈవో



పెన్ పవర్ డెస్క్:తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తెలంగాణ ప్రజాప్రతి నిధుల సిఫారసు లేఖలను స్వీకరి స్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తెలంగాణ లీడర్ల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించి వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలు వివరాలు 2లో..

## నేను ఎక్కడికీ పారిపోలేదు


- లాయర్ల సూచన మేరకు మీడియా ముందుకు రాలేదన్న పేర్ని నాని
- పోలీసు విచారణ కంటే సోషల్ మీడియాలో రచ్చ ఎక్కువయిందని అసహనం
- తనను, తన కుమారుడిని అరెస్ట్ చేయాలని చూస్తున్నారని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:తాను పారిపోయానని తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మచిలీపట్నంలోనే ఉన్నానని... తన లాయర్ల సూచన మేరకే మీడియా ముందుకు రాలేదని చెప్పారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ వివరాలు 2లో..




## వైద్య ఆరోగ్య శాఖలో కీలక ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం

- వైద్య ఆరోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 190 కొత్త 108 వాహనాల కొనుగోలుకు పచ్చజెండా
- 104 అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు




పెన్ పవర్ డెస్క్:ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖలో పలు కీలక ప్రతిపాదనలకు ఆయన ఆమోదం తెలిపారు. 190 కొత్త 108 వాహనాల వివరాలు 2లో..


# నవంబరు నెలలో తిరుమల శ్రీవారి ఆదాయం రూ.113 కోట్లు

- గత నెలలో వెంకన్నను దర్శించుకున్న 20.37 లక్షల మంది భక్తులు
- తలనీలాల మొక్కు సమర్పించుకున్న వారి సంఖ్య 7.31 లక్షలు
- వివరాలు వెల్లడించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

పెన్ పవర్ డెస్క్:నవంబరు నెలలో తిరుమల శ్రీవారికి హుండీ ద్వారా రూ.113 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. గత నెలలో స్వామివారిని రూ.20.37 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని, 97 లక్షల లడ్డూలు విక్రయించామని వివరించారు. 7.31 లక్షల మంది భక్తులు వెంకటేశ్వరస్వామి వారికి తలనీలాల మొక్కు సమర్పించుకున్నారని... 19.74 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారని బీఆర్ నాయుడు తెలిపారు.

### గరుడాద్రి పర్వతానికి కొత్త వెలుగులు

కాగా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాలతో గరుడాద్రి పర్వత శ్రేణుల వద్ద టీటీడీ విద్యుత్ సిబ్బంది ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాటు చేశారు. గరుడాద్రి పర్వతం... తిరుమల వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# భారత అంతరిక్ష పితామహుడు

# విక్రమ్ సారాభాయి

## -నేడు ఆయన వర్ధంతి




( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ఈయన భారత అంతరిక్ష పరిశోధనకు మూల పురుషుడు. అందుకే ఈయన పేరుమీద అంటే విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఉంది. ఇది భారత అంతరిక్ష పరిశోధనా సంస్థకు చెందిన ప్రధాన కేంద్రం. ఇది భారత ఉపగ్రహ కార్యక్రమానికి చెందిన అంతరిక్ష వాహనాల (శాటిలైట్స్)ను తయారు చేస్తుంది.

ఈ కేంద్రం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఉంది. ఈ కేంద్రం 1962 లో తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషనుగా మొదలైంది. 1971 డిసెంబరు 30న భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడైన డా. విక్రం సారాభాయ్ మరణం తర్వాత, ఈ కేంద్రానికి ఆయన పేరు పెట్టారు. ఈ కేంద్రంలోనే సౌండింగు రాకెట్లు, రోహిణి, మేనక లాంచర్లు, ఎస్సెల్వీ, ఏఎస్సెల్వీ, పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి మార్క్ 3 మొదలైన వాహక నౌకల రూపకల్పన కేంద్రమిది. విక్రమ్ సారాభాయి గత 1919 ఆగస్టు 12వ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాదులో జన్మించారు. వారి కుటుంబం ధనవంతులైన వ్యాపారస్తుల కుటుంబం. ఆయన తండ్రి అంబాలాల్ సారాభాయ్ అక్కడ పేరు పొందిన పారిశ్రామికవేత్త. ఆయనకు అక్కడ ఎన్నో మిల్లులు ఉండేవి. అంబాలాల్, సరళా దేవి దంపతులకు కలిగిన ఎనిమిది మంది సంతానంలో విక్రం సారాభాయ్ ఒకడు.

తన ఎనిమిది మంది పిల్లలను చదివించడానికి విక్రం సారాభాయి తల్లి మాంటిస్సోరీ తరహాలో ఒక ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసింది. వీరి కుటుంబం స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటూ ఉండటం మూలాన వారింటికి మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, మరియు జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన ఎంతో మంది ప్రముఖులు తరచూ వస్తూ ఉండేవారు. వీరు విక్రం సారాభాయ్ వ్యక్తిత్వాన్ని ఎంతగానో ప్రభావితం చేశారు. అహమ్మదాబాదులోని గుజరాత్ కళాశాలలో మెట్రిక్ విద్యను పూర్తి చేసుకున్న విక్రమ్ సారాభాయ్... తరువాత పై చదువుల కోసం ఇంగ్లండులోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లారు. 1940వ సంవత్సరంలో అక్కడ నాచురల్ సైన్సెస్‌లో, ట్రిపోస్‌లో ఉత్తీర్ణులయ్యారు. ఆ సమయంలో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం కావటంతో భారతదేశానికి తిరిగివచ్చిన విక్రమ్ సారాభాయ్... బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సర్ సీ.వీ.రామన్ పర్యవేక్షణలో కాస్మిక్ కిరణాలపై పరిశోధన మొదలుపెట్టారు. తదనంతరం రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత 1945వ సంవత్సరంలో తిరిగీ కేంబ్రిడ్జి యూనివర్సిటీకి వెళ్లి పీహెచ్‌డీ పట్టాను సాధించుకుని 1947లో తిరిగి భారత్ చేరుకున్నారు. 1957లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ అయిన స్పుత్నిక్‌ను ప్రయోగించినపుడు... భారత భవిష్యత్ అవసరాలకు శాటిలైట్ల అవసరం గురించి ఎంతో విషయ సేకరణ చేయటమేగాకుండా, ఆ శాటిలైట్ యొక్క ఆవశ్యకతను అప్పటి ప్రధానమంత్రి అయిన జవహర్‌లాల్ నెహ్రూకు వివరించి, ఆయనను ఒప్పించారు. ఆ పిమ్మట భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడైన హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఐఎన్‌సీఓఎస్‌పీఏఆర్) సెంటర్‌ను ఆయన ఏర్పాటు చేశారు. తదనంతరం ఆయన ఆదర్శాలకు అనుగుణంగా ఇస్రో ఎన్నో విజయాలను సాధించి భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపచేసింది.

'భారత అంతరిక్ష రంగ పితామహుడు'గా కీర్తి గడించిన సారాభాయ్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను 1962లో శాంతి స్వరూప్ భట్నగర్ అవార్డుతో, 1966లో పద్మ భూషణ్ అవార్డుతో సత్కరించింది. జాతీయ స్థాయిలోను, అంతర్జాతీయంగానూ అర్థవంతమైన పాత్ర పోషించగలగాలంటే, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంలో మనం ఎవరికీ తీసిపోకుండా ఉండాలని చెప్పి, ఆ దిశగా కృషి చేసిన సారాభాయ్ 1971, డిసెంబరు 30వ తేదీన పరమపదించారు.

# జగన్... మీ వాళ్లను కంట్రోల్ చేసుకో... నా సహనాన్ని పరీక్షించవద్దు

- మొదటి పేజీ తరువాయి

గాలివీడు గ్రామానికి చేరుకున్నారు. దాడి జరిగిన ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి దాడి చేయడానికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ, ప్రభుత్వం అండగా ఉంటుందని, ధైర్యంగా పనిచేసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ నేతలకు స్పష్టమైన హెచ్చరికలు చేశారు. ఎవరైనా సరే ఏ ఒక్క ప్రభుత్వ అధికారిపై జులుం చేసినా, ఇష్టంవచ్చినట్టు మాట్లాడినా మా సమాధానం కరాఖండీగా ఉంటుంది అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నాను కాబట్టి పద్ధతిగా, ఎంతో జాగ్రత్తగా మాట్లాడుతున్నాను.... నా సహనాన్ని పరీక్షించవద్దు అని పేర్కొన్నారు. ఒకవైపు రాయలసీమ యువత ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు పోతుంటే, మరోవైపు మీరు దాడుల సంస్కృతి కొనసాగిస్తారా? అని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇవాళ మేం అధికారులకు ధైర్యం ఇవ్వడానికి వచ్చాం. ఇక నుంచి వైసీపీ వాళ్లు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడకపోయినా, సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్టు పిచ్చి కూతలు కూసినా, ఇలా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి దాడులకు పాల్పడినా పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. జగన్... ధర్నాలు అని కల్లబొల్లి కబుర్లు చెప్పడం కాదు... మీ నాయకులను నిగ్రహంతో ఉండమని చెప్పు. సుదర్శన్ రెడ్డి మనుషులకు చెబుతున్నా... మీరు మళ్లీ ఇలాంటి పిచ్చి వేషాలు వేస్తే నేను కడపలో తిష్ట వేస్తాను. అవసరమైతే నా క్యాంప్ ఆఫీసును కడపలోనే ఏర్పాటు చేసుకుని, మిమ్మల్ని సరిచేసేంతవరకు ఇక్కడ్నించి కదలను. రాయలసీమ ఏ ఒక్కరి జాగీరు కాదు... ఏ ఒక్కరి కోట కాదు. మీ ఇష్టానుసారం వచ్చి గవర్నమెంటు ఆఫీసుల్లో దాడులు చేస్తాం, నోటికొచ్చినట్టు మాట్లాడతాం అంటూ చూస్తూ ఊరుకునేది లేదు. అన్ని పరిస్థితులకు రాటుదేలి ఇక్కడవరకు వచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా వ్యవహరించడం లేదు. మేం చాలా సంయమనంతో ఉన్నాం... మా సహనాన్ని పరీక్షించవద్దు. గత ఐదేళ్లలో మీరేం చేసినా చెల్లిందేమో కానీ, ఇంకా మీరు ఆధిపత్య ధోరణితో వ్యవహరించాలనుకుంటే ఇక నడవదు. ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి చేసిన 15 మందిని పట్టుకెళ్లి బొక్కలో పెట్టేంతవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదు" అంటూ పవన్ గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

# ముగిసిన మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు...

పెన్ పవర్ డెస్క్:మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్ లో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలను పూర్తి చేశారు. సిక్కు సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. మన్మోహన్ సింగ్ పాడెను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మోశారు. శనివారం (డిసెంబర్ 28) ఉదయం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుండి ప్రారంభమైన అంతిమయాత్ర నిగమ్‌బోద్ ఘాట్ వరకు 11 కిలో మీటర్ల మేర సాగింది

అంత్యక్రియలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధన్కడ్, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, త్రివిధ దళాల అధిపతులు హాజరయ్యారు. పలువురు విదేశీ ప్రముఖులు కూడా అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వీరిలో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్ చుక్ కూడా ఉన్నారు.

92 ఏళ్ల మన్మోహన్ సింగ్ మొన్న రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. పదేళ్ల పాటు ప్రధానిగా దేశానికి సేవలందించిన మన్మోహన్... ఆర్బీఐ గవర్నర్ గా, పీవీ నరసింహారావు హయాంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు.

# నేను ఎక్కడికీ పారిపోలేదు

- మొదటి పేజీ తరువాయి

ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమ గోడౌన్ లో బియ్యం బస్తాలు తగ్గాయని చెపితే... దానికి నగదు చెల్లించామని... అయినా కక్ష కట్టి తమపై కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. ఏదీ తేలక ముందే తనను దొంగ అంటున్నారని చెప్పారు. పోలీసు విచారణ కంటే సోషల్ మీడియాలో రచ్చ ఎక్కువయిందని అసహనం వ్యక్తం చేశారు. జనవరి 2వ తేదీలోగా తనను, తన కుమారుడిని అరెస్ట్ చేయాలనే ప్లాన్ లో ఉన్నారని పేర్ని నాని చెప్పారు. ఈ నెల 30వ తేదీన బెయిల్ పిటిషన్ పై తీర్పు

ఉన్నందున అన్ని విషయాల గురించి మాట్లాడలేకపోతున్నానని తెలిపారు. తమ అధినేత జగన్ కంటే ఎక్కువగా తనను టార్గెట్ చేస్తున్నారని చెప్పారు.

# వైద్య ఆరోగ్య శాఖలో కీలక ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

కొనుగోలుకు పచ్చజెండా ఊపారు. ఇందుకు రూ.60 కోట్ల వ్యయం కానుంది. 108 డ్రైవర్లకు జీతంతో పాటు అదనంగా రూ.4 వేలు ఇచ్చే విధానాన్ని మళ్లీ తీసుకురావాలని సీఎం నిర్ణయించారు. పేదలు ఆసుపత్రుల్లో చనిపోతే వారి మృతదేహాలను తరలించే మహాప్రస్థానం వాహనాల సంఖ్యను మరింత పెంచేందుకు ఆమోదం తెలిపారు. ఇక, ఎన్టీఆర్ బీమా విధానంలో రాష్ట్రాన్ని రెండు యూనిట్లుగా విభజించే పథకం అమలు చేయాలన్న ప్రతిపాదనకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. ప్రస్తుతానికి ట్రస్టు విధానంలో ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాన్ని బీమా విధానంగా మలిచేందుకు ఉన్న అవకాశాలపై నేటి సమీక్షలో చర్చించారు. గ్రామాల్లో వైద్య సేవలు అందించేందుకు 104 అంబులెన్స్ ల వ్యవస్థను మళ్లీ బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ అంబులెన్స్ ల్లో ల్యాబ్ టెక్నీషియన్ ను నియమించి, పలు రకాల వైద్య పరీక్షలు చేసే సౌకర్యాన్ని మళ్లీ కల్పించాలన్న ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించినట్టు తెలుస్తోంది. అదే సమయంలో... 108, 104, ఎన్టీఆర్ బీమా పథకం సేవలను ఒకే కాల్ సెంటర్ ద్వారా నిర్వహించాలన్న ప్రతిపాదన కూడా కార్యరూపం దాల్చనుంది. ఈ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు నేటి సమీక్షలో అధికారులతో చర్చించారు.

ఇక, ప్రివెంటివ్ హెల్త్ కేర్ పై శ్రద్ధ చూపించాలని, 104 వాహనాల ద్వారా రక్త పరీక్షలు, ఇతర సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించే విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వమే ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి హెల్త్ కార్డులు ఇచ్చే విధానం తీసుకువస్తే మంచి ఫలితాలు ఉంటాయని సీఎం అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో ఏఐ సాంకేతికత సేవలు ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరూ ఆసుపత్రికి రావాల్సిన అవసరం లేకుండా, టెక్నాలజీ ద్వారా వైద్య సాయం పొందే విధానం రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.

# తెలంగాణకు తిరుమల షాక్.. సిఫార్సు లేఖపై నిర్ణయం తీసుకోలేదన్న ఈవో

- మొదటి పేజీ తరువాయి

స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయ నాయకుల సిఫారసు లేఖల స్వీకరణపై టీటీడీ ఈవో శ్యామల రావు కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను స్వీకరిస్తున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదని తెలిపారు. మీడియాలో అలా ప్రచారం జరుగుతోందని.. కానీ తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఈవో శ్యామల రావు వివరణ ఇచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించకపోవడంపై రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ టీటీడీ తీరును బహిరంగంగానే తప్పుబట్టారు.

తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ లీడర్ల సిఫారసు లేఖలు స్వీకరించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. వారంలో రెండు రోజులు సిఫారసు లేఖలపై దర్శనానికి అవకాశం కల్పించినట్లు మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వెలువడ్డాయి. దీంతో అప్రమత్తమైన టీటీడీ ఈవో శ్యామల రావు.. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణపై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ లీడర్ల లేఖలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

# నవంబరు నెలలో తిరుమల శ్రీవారి ఆదాయం రూ.113 కోట్లు

- మొదటి పేజీ తరువాయి

నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డు చివరలో ఉంటుంది. గత ఐదేళ్లుగా అక్కడ లైట్లు లేవని తెలుస్తోంది. ఇటీవలే టీటీడీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు దీనిపై దృష్టి సారించారు. తాజాగా విద్యుత్ సిబ్బంది ఇక్కడ లైట్లు ఏర్పాటు చేయడంతో గరుడాద్రి పర్వతం వెలుగులు విరజిమ్ముతోంది. అంతేకాదు. ఘాట్ రోడ్డును ఆనుకుని ఉండే వినాయక ఆలయం వద్ద ట్రయల్ రన్ కింద ఆరు ఫోకస్ లైట్లను ఏర్పాటు చేశారు.

# డిజిటల్ అరెస్ట్ అనేదే లేదు... అలాంటి వాటిని ఎవరూ నమ్మవద్దు

- మొదటి పేజీ తరువాయి

ఈ పరిణామాలపై ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పందించారు. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనేదే లేదని, అలాంటి బెదిరింపులను ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేశారు. గత కొంతకాలంగా సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరుగుతోందని అన్నారు. ఈ ఏడాది సైబర్ క్రైమ్ కు సంబంధించి 916 కేసులు నమోదు చేశామని డీజీపీ వెల్లడించారు. 2024లో సైబర్ నేరాల ద్వారా మోసగాళ్లు రూ.1,229 కోట్లు తస్కరించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతకర పోస్టులు పెట్టడంపై ఇప్పటిదాకా 572 కేసులు నమోదు చేశామని, ఆయా కేసుల్లో నిందితులపై రౌడీ షీట్ తరహాలో సైబర్ షీట్ తెరుస్తామని చెప్పారు. మార్చి 31 నాటికి కమాండ్ కంట్రోల్ కార్యాలయంతో 1 లక్ష సీసీ కెమెరాలను అనుసంధానం చేస్తామని చెప్పారు. ఇప్పటికే 25 వేల సీసీ కెమెరాలను వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన 'ఈగల్' వ్యవస్థ గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ప్రజల్లోకి బలంగా వెళుతోందని అన్నారు. గంజాయి కాకుండా ఇతర పంటలు సాగు చేయాలని గిరిజనులకు చెబుతున్నామని డీజీపీ వెల్లడించారు.

ఇక, దేశంలో తొలిసారిగా ఏపీలోనే 'స్మార్ట్ పోలీస్ ఏఐ'ని ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఏలూరు జిల్లా పోలీసులు 'స్మార్ట్ పోలీస్ ఏఐ'ని ప్రారంభించారని వివరించారు. నేరాల నమోదు నుంచి కేసు విచారణ వరకు 'స్మార్ట్ పోలీస్ ఏఐ' సాంకేతికత సాయం తీసుకుంటున్నట్టు వెల్లడించారు. విజయవాడలో ట్రాఫిక్, ప్రజా రద్దీ నియంత్రణకు ఏఐ సాంకేతికత ఓ అస్త్రంలా ఉపయోగపడుతుందని తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భద్రతా వలయంలోకి నకిలీ ఐపీఎస్ చొరబడడం పట్ల విచారణ జరుపుతున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. భూ కబ్జాలు, ఇసుక అక్రమ తవ్వకాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పీడీ యాక్ట్ కేసులు పెడతామని స్పష్టం చేశారు.

# విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు... తెలుగువారందరికీ గర్వకారణం: సీఎం చంద్రబాబు

- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలపై ఎక్స్ వేదికగా స్పందించిన చంద్రబాబు
- మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించాలని పిలుపు
- తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు అద్వితీయ త్యాగం చేశారన్న ముఖ్యమంత్రి
- ఈ మహాసభలు జరిగే ప్రాంగణానికి ఆయన పేరు పెట్టడం అభినందనీయం అన్న సీఎం




విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలపై సీఎం చంద్రబాబు నాయుడు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారందరికీ గర్వకారణం అని అన్నారు. ఈ సందర్భంగా మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించాలని పిలుపునిచ్చారు. ఆ లక్ష్యంగా నిర్వహిస్తోన్న ఈ మహాసభలు జరిగే ప్రాంగణానికి, అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టడం అనేది ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన అద్వితీయ త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందని పేర్కొన్నారు. అలాగే ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రామోజీరావు పేరు పెట్టడం కూడా అభినందనీయం అన్నారు.

ఇక ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగు భాషాభిమానులు అందరికీ ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ మహాసభలు విజయవంతం అవ్వాలని కోరుకుంటూ... నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## నేను ఈ వ్యక్తికి ఫ్యాన్ అయ్యాను

ఏపీ ముఖ్యమంత్రిని ఇమిటేట్ చేసిన ఒక వ్యక్తి వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియో ఏపీ మంత్రి నారా లోకేశ్ వరకు చేరింది. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతా ద్వారా షేర్ చేసిన లోకేశ్... తాను ఈ వ్యక్తికి ఫ్యాన్ అయ్యానని చెప్పారు. చంద్రబాబు మాదిరి కనిపించడానికి, మాట్లాడేందుకు ఎంత కష్టపడ్డాడో చూడండని అన్నారు.

ఇటీవల ఒక పెళ్లి వేడుకకు ఒక మిమిక్రీ ఆర్టిస్టు అచ్చం చంద్రబాబు వేషధారణలో వచ్చారు. వేదికపైకి వచ్చి అందరికీ విక్టరీ సింబల్ చూపించారు. చంద్రబాబు మాదిరే మాట్లాడుతూ అక్కడున్న అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

### కొండబిట్రగుంటకు బస్సు ప్రారంభించిన ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి





**కావలి పెన్ పవర్ డిసెంబర్ 28**

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, హైదరాబాద్, బెంగుళూరు లాంటి మహానగరాలకు ఆధునిక బస్సులు ఏర్పాటుచేస్తామని ఎపియస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కావలి బస్టాండ్ నుండి కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంకు బస్సును ప్రారంభించారు. అంతకు ముందు ఆయన కావలి బస్టాండ్ లో తనిఖీలు నిర్వహించారు. పలువురు ప్రయాణికులు,బస్టాండ్ వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డిపో మేనేజర్ కార్యాలయంలో సిబ్బంది మరియు పట్టణ ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఇకపై ప్రతీ శనివారం కావలి నుండి కొండబిట్రగుంటకు బస్సును నడపటంతో పాటు ప్రతీ శుక్రవారం సాయంత్రం జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన జొన్నవాడ కామాక్షితాయి సన్నిధికి కూడా బస్సును ప్రారంభిస్తామని అన్నారు. కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి మరియు ఆర్టీసీ అధికారులతో సంప్రదించి, కావలి నుండి హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు స్లీపర్ కోచ్ బస్సులను కూడా నడిపేందుకుకు ప్రయత్నిస్తామని అన్నారు. కావలి బస్టాండ్ లో అపరిశుభ్ర వాతావరణం ఉండడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ మరియు మునిసిపల్ అధికారుల సహకారంతో బస్టాండ్ ఆవరణలో మురికి నీరు ఆగకుండా చర్యలు చేపడటామని అన్నారు. బస్టాండ్ ఎదుట ప్రైవేట్ బస్సులు ఆగకుండా పోలీస్ మరియు రవాణాశాఖ అధికారులను కోరుతామని వివరించారు. ఈ సందర్భంగా కావలి డిపో అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు సురేష్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. పలువురు పట్టణ ప్రముఖులు పలు సమస్యలపై జోనల్ చైర్మన్ కు అర్జీలు అందజేశారు. అనంతరం బస్సును ప్రారంభించి, కొండబిట్రగుంట వరకు బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ ( ట్రాఫిక్ ) కల్పనా రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ( మెకానికల్ ) యస్కె ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ ( ఆఫీస్ ) గంగు విజయకుమారి, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి రవిప్రకాష్ , ప్రముఖ వస్త్ర వ్యాపారులు అమరా సుబ్బారావు, సీవీసీ సత్యం, బియంయస్ నాయకులు తోట్టెంపూడి ప్రసాదరావు, నూనె వ్యాపారి ఓరుగంటి వెంకటేశ్వర్లు,బీజేపీ నాయకులు గుండ్లపల్లి భరత్ కుమార్,బ్రహ్మానందం, కమల, రంగారెడ్డి, రమణారెడ్డి, మందా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

# గాలివీడు ఎంపీడీవో పై దాడి హేయమైన చర్య

### ఎంపీడీవో సిహెచ్. శ్రీదేవి



**కావలి పెన్ పవర్ డిసెంబర్ 28**

అన్నమయ్య జిల్లా గాలివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జవహర్ బాబు పై జరిగిన దాడికి నిరసనగా శనివారం కావలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో సిహెచ్ శ్రీదేవి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సిహెచ్ శ్రీదేవి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో పై దాడి చేయడం చాలా హేయమైన చర్య అని దీనిని ఖండిస్తున్నామని అన్నారు. ఇటువంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా వాటికి అనుగుణంగా ప్రభుత్వం చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిందితులపై వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిప్యూటి సీఎం మరియు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొనిదెల పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి బాధితున్ని పరామర్శించి నిందితులపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినందుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మరియు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకతాయి బైక్ రైడర్స్‌కు తాటతీస్తా...

**ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు**

**సైలెన్సర్ లను రోడ్ రోలర్ సహాయంతో నుజ్జు నుజ్జు**

**పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వండి కానీ దానిని హద్దులో ఉంచండి**

**ర్యాష్ డ్రైవింగులను, అధిక శబ్ద కాలుష్యం కలిగించే వాహనదారులపై కఠిన చర్యలు**

**తిరుపతి నగరంలో రోజు రోజుకు శబ్ద కాలుష్యం ఎక్కువ అవుతోంది**

**అధిక శబ్దం చేసే వాహనాలను సీజ్ చేస్తాం**

**సైలెన్సర్ మార్చే మెకానిక్ వారిపై కూడా కేసు నమోదు**



**తిరుపతి - పెన్ పవర్ బ్యూరో, డిసెంబర్ 28**

తిరుపతి నగరం నందు బుల్లెట్ వాహనాలకు అధిక శబ్దం వచ్చే విధంగా సైలెన్సర్ ఏర్పాటు చేసుకొని శబ్ద కాలుష్యన్ని కలిగిస్తునారు. వీటిపై నగరంలో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి అధిక శబ్దం కలిగించే బుల్లెట్లను గుర్తించి, సీజ్ చేసినటువంటి సైలన్సర్ లను రోడ్డు రోలర్ ద్వారా ధ్వంసం చేయడం జరిగింది. అంతే కాకుండా వారి! వలన ప్రజలు పడే ఇబ్బందుల గురించి ట్రాఫిక్ పోలిస్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ నగరంలో గత కొద్ది రోజులుగా బుల్లెట్ వాహనాలకు 65 డెసిబెల్ కంటే ఎక్కువగా శబ్దం కలిగించే వాహనాలను గుర్తించాము. యువత, కాలేజీ విద్యార్థులు ఫ్యాషన్ లు కొరకు బైక్ లకు షోరూమ్ నుండి రిజిస్టరుగా వచ్చిన సైలెన్సర్ లను మార్చి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తునారు.శబ్ద కాలుష్యం వలన మోటారు వాహన చట్టానికి వ్యతిరేకంగా, అతిక్రమించడంగా అవుతుంది. అధిక మోతాదులో శబ్దం వచ్చే విధంగా సైలెన్సర్ లను అమర్చుకోరాదు. దాని వలన శబ్ద కాలుష్యం అధికంగా ఉండటం వలన రోడ్డుపై ప్రయాణించే ప్రజలు భయ భ్రాంతులకు లోనవుతున్నారు. ఇందులో మీ చెల్లలు, అక్కలు, తల్లిదండ్రులు కూడా ఉండవచ్చు అలాగే నివాసాలలో ఉన్నవారు కూడా చాలా ఇబ్బందికర వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారు.

జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని విధాలుగా అవగాహన కార్యక్రమాలు జరుపుతూఉంది. బుల్లెట్ వాహనాలు, రేస్ బైకులు కొనుగోలుచేసే వారి తల్లిదండ్రులను గుర్తించి వారికి త్వరలో కౌన్సిలింగ్ కూడా ఇవ్వడం జరుగుతోంది. వాహనదారులు ధ్వని కాలుష్యం అతిక్రమణకు పాల్పడకుండా ప్రజలు, యువత ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరించాలని అందరు సురక్షితంగా ప్రయాణించే విధంగా ఉండాలని కోరుతున్నాను అని అన్నారు. అదేవిధంగా సుప్రీం కోర్ట్ మరియు హైకోర్టు గైడ్లైన్స్ ప్రకారం అందరూ కూడా హెల్మెట్ ధరించే విధంగా ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేయడం కూడా జరుగుతుంది ప్రజలందరూ కూడా మీ భద్రత కోసమే చెబుతున్నాం. మీరు భద్రంగా ఉంటే మీ కుటుంబ భద్రంగా ఉంటుంది మీరు సురక్షితంగా ఉంటేనే భవిష్యత్తు బాగుంటుంది,కాబట్టి అందరూ ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి మీ బాధ్యతగా హెల్మెట్ ధరించి రాష్ట్రానికి తిరుపతి జిల్లా ఆదర్శంగా నిలవాలని కోరి ప్రార్థిస్తున్నాను ఆని అన్నారు. అనంతరం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహణ ర్యాలీలో పాల్గొని జెండా ఊపి ర్యాలిని ప్రారంభించి, ఎస్పీ కూడా హెల్మెట్ ధరించి వాహనం నడిపారు. ర్యాలీలో పోలిస్ అధికారులు సిబ్బంది, మహిళా విశ్వవిద్యాలయం సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లు వెంకటేశ్వరరావు అడ్మిన్, రవిమనోహరాచారి , ట్రాఫిక్ డి.యస్.పి రామకృష్ణ ఆచారి, సి.ఐ లు సుబ్బారెడ్డి, సంజీవ కుమార్, యస్.ఐ మరియు సిబ్బంది వారు పాల్గొన్నారు.

# వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి డి.ఎస్.పి పి శ్రీధర్





**కావలి పెన్ పవర్ డిసెంబర్ 28**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కావలి డి.ఎస్.పి.పి శ్రీధర్ తెలిపారు. శనివారం హెల్మెట్ వినియోగం పై అవగాహన కల్పిస్తూ డి.ఎస్.పి ఆధ్వర్యంలో డి.ఎస్.పి కార్యాలయం వద్ద నుండి బృందావనం కాలనీ వరకు బైక్ ర్యాలీగా వెళ్లి తిరిగి డి.ఎస్.పి కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి.ఎస్.పి పి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంటు ధరించడం వల్ల ప్రయాణ సమయంలో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణాపాయం నుండి బయట పడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ ఎండి ఫిరోజ్ ,టూ టౌన్ సిఐ గిరిబాబు, ఎస్ఐలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# మదర్ థెరిసా కళాశాలలో బజాజ్ ఫిన్ సర్వ్ చే ఉచిత శిక్షణ కార్యక్రమాలు పూర్తి



**పలమనేరు డిసెంబరు 28,(పెన్ పవర్):**

గంగవరం మండలంలోని మదర్ థెరిసా ఎమ్.బి.ఎ కళాశాలలో బజాజ్ ఫైనాన్సిఎల్ సర్వీసెస్ వారిచే ఆరోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాలు శనివారం తో ముగిశాయని,గత 16రోజులుగా కంపెనీ పంపినఅనుభవజ్ఞులైన నిపుణులచే విద్యార్థులకు ఆర్థికపరమైన అంశాలను,ఫైనాన్స్ మరియు బ్యాంకింగ్ రంగంతో వస్తున్న వివిధ సాంకేతిక మార్పులను వివరించారని కళాశాల కరస్పాండెంట్ యం.రవీంద్రంబు తెలిపారు.ఫైనాన్స్ మరియు బ్యాంకింగ్ అంశాలతో చేయదగిన సర్టిఫికేట్ కోర్సుల గురించి వివరించడమే కాక కమ్యునికేషన్ మరియు సాఫ్ట్ స్కిల్స్ ను పెంపొందించే. దిశగా శిక్షణ ఇవ్వడం జరిగినదని,దీనివలన ఎమ్.బి.ఎ.విద్యార్థులకు ఉపాది అవకాశాలు మెరుగు పడతాయని రవీంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణనిచ్చే అద్యాపకులతో పాటు కంపెనీ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు. ఇందులో కరెస్పాన్డెంట్ రవీంద్రబాబు,చైర్మన్ సునీల్,డైరెక్టరు రాజేంద్రరెడ్డి,ప్రిన్సిపాల్ వెంకటరావు,హెచ్.ఓ.డి.వీణ,ఇంచార్జి మునిబాబు,అలాగే 150మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒక రోజు ముందే జనవరి నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు

**ఒక రోజు ముందుగానే ఫించన్లను పంపిణీ చేస్తున్న కూటమి ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న పలువురు పెన్షన్ లబ్ధిదారులు**

**డిసెంబర్ 31న జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ.**

**జిల్లాలో 2,63,995 మంది ఎన్టీఆర్ భరోసా ఫించన్ లబ్దిదారులకు సుమారు రూ. 112.59 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి - పెన్ పవర్ బ్యూరో, డిసెంబర్ 28**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు జనవరి నెలలో పంపిణీ చేయాల్సిన చెల్లింపులు జనవరి 1 వ తేది నూతన ఆంగ్ల సంవత్సరం తొలిరోజు కావడం వలన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31 వ తేదీన మంగళవారం ఉదయం 6.00 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 వ తేదీన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు ఏదైనా కారణం చేత తీసుకోని లబ్ధిదారులకు 02.01.2025 తేదీన వారి ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం జనవరి నెల పెన్షన్ల పంపిణీ పై కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో జనవరి నెలలో 2,63,995 మంది ఫించన్ దారులకు సుమారు 112.59 కోట్ల రూపాయిలు పంపిణీ చేయవలసి ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే 31.12.2024 వ తేదిన పెన్షన్ల పంపిణీ చేపట్టాలని, అదే రోజు 100 శాతం ఫించన్లు పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జనవరి నెల ఫించన్లు ఒక రోజు ముందుగా 31.12.2024 న ఇస్తున్న విషయాన్ని ప్రతి ఫించన్ దారునికి వ్యక్తిగతంగా తెలియచేయాలని, అలాగే ఫించన్ పంపిణీకి నిర్దేశించిన సిబ్బంది తప్పకుండా ఆరోజు ఉదయం 6 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. జిల్లాలోని పలువురు పెన్షన్ లబ్ధిదారులు ఒక రోజు ముందుగానే ఫించన్ ఇస్తున్నందుకు కూటమి ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ కూడా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే గత నెలలలో ఏదేని కారణంతో ఫించన్ తీసుకోని వారికి ఈ నెల పించన్ మొత్తంతో కలిపి పంపిణీ చేయబడుతుందన్నారు. అలాగే నవంబర్ 2024 నెలలో జీవిత భాగస్వామి మరణించిన వారికి ఈ నెలలో కొత్తగా ఫించన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. కావున ఈ సమాచారం అందరికి తెలియచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, మునిసిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మాజీ పట్టణ టీడీపీ అధ్యక్షులు డాంగేకు బొజ్జల బృందమ్మ పరామర్శ



**శ్రీకాళహస్తి - పడన్ పవర్, డిసెంబర్ 28.**

భార్య వియోగంతో బాధపడుతున్న మాజీ పట్టణ టీడీపీ అధ్యక్షులు డాంగేను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షులు డాంగే సతీమణి, కిట్టు మాతృమూర్తి పద్మావతి స్వర్గసతులయ్యారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ భార్య వియోగంతో బాధపడుతున్న మాజీ పట్టణ టీడీపీ అధ్యక్షులు డాంగేను పరామర్శించి, డాంగే సతీమణి. కిట్టు మాతృమూర్తి పద్మావతి చిత్రపటానికి నివాళులార్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని మాజీ పట్టణ టీడీపీ అధ్యక్షులు డాంగే మనోధైర్యం కల్పించారు.

# సర్వాయపాలెంలో రెవెన్యూ సదస్సు

### ముఖ్య అతిథిగా పాల్గొని అర్జీలు స్వీకరిస్తున్న తహసిల్దార్ పి శ్రావణ్ కుమార్






**కావలి పెన్ పవర్ డిసెంబర్ 28**

కావలి రూరల్ మండలం పరిధిలోని సర్వాయపాలెం పంచాయతీలో శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఉప్పల వెంకట్రావు, గుడిపల్లి నారయ్య, ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్వో పి శ్రావణ్ కుమార్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ ఆరోవ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు జరుగు గ్రామ సభల సందర్భంగా సర్వాయపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగిందని ఈ సదస్సులో 17 అర్జీలు వచ్చినట్లు ఎమ్మార్వో పి శ్రావణ్ కుమార్ తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి సౌకర్యాలు కల్పించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని ఎమ్మార్వో తెలిపారు. రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని వాటిని పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందిన దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ,విఆర్ఓ హరీష్, తెలుగుదేశం పార్టీ నాయకులు బ్రహ్మయ్య, పొట్టయ్య, వెంకట రమణయ్య,తదితరులు పాల్గొన్నారు.

# జెండా ఊపి రథయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కావలి పెన్ పవర్ డిసెంబర్ 28**

9వ శ్రీశ్రీ గౌర నితాయ్ (కృష్ణ - బలరామ్) రథయాత్రను కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. రథయాత్ర కావలి పట్టణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కు ఇస్కాన్ సభ్యులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. రథయాత్రలో పాల్గొన్న ఆయన రథం తో పాటు నడిచారు. పెద్ద ఎత్తున విచ్చేసిన ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఎమ్మెల్యే రథయాత్రలో పాల్గొన్నారు.. సృష్టిలోని జీవరాసులలో మనిషి ప్రత్యేకతను ఈ సందర్భంగా వివరించారు. మానవ జన్మ కల్పించిన దేవునికి కృతజ్ఞతలు తెలుపుకోవాలని, సాటివారికి సేవ చేయాలని కోరారు. హరే రామ, హరే కృష్ణ శ్లోకం గురించి వివరించి అందరినీ ఆకట్టుకున్నారు.

# గుండెపోటుతో వెటర్నరీ ఉద్యోగి మృతి



**పలమనేరు డిసెంబరు 28,(పెన్ పవర్)**

రూరల్ మండలంలోని కొలమాసనపల్లి వెటర్నరీ హాస్పిటల్ నందు అటెండర్ గా డేవిడ్ రాజ్ విధులు నిర్వహిస్తుండగా శనివారం ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మరణించారు. స్థానికుల సమాచారం మేరకు మృతుని స్వస్థలం నెల్లూరు జిల్లా కాగా నియోజకవర్గ పరిధిలోని బైరెడ్డిపల్లె మండలంలో 20 ఏళ్లు పనిచేశారు. గత రెండేళ్లుగా కొలమాసనపల్లి వెటర్నరీ హాస్పిటల్లో పనిచేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని తెలిసింది.కాగా మృతుని భౌతిక దేహాన్ని అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

# ముక్కంటిని దర్శించుకున్న కుంభకోణం ధర్మపురం పీఠాధిపతులు







**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, డిసెంబర్ 28**

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తి స్వామి వారి దేవస్థానానికి తమిళనాడుకు చెందిన శైవ పీఠాధిపతులు కుంభకోణం ధర్మపురం ఆధీనం శ్రీ మాసిలామణి దేశీగ జ్ఞానసంబంధ స్వామివారు దర్శనానికి విచ్చేశారు.వారిని దేవస్థానం ఏఈఓ లోకేష్ రెడ్డి స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు.శ్రీ మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద వేద పండితులు స్వామీజీ వారిని శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామీజీ వారని దేవస్థానం కార్యనిర్వణాధికారి టి బాపిరెడ్డి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. త్వరలో జరగబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు స్వామీజీని దేవస్థానం కార్యనిర్వహణా ధికారి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పిఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సభ్యత్వ నమోదులో లక్కమనేని మధు 'రికార్డు'

### ఏడు రోజుల్లోనే 1000 సభ్యత్వాలు పూర్తి...!



**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, డిసెంబర్ 28**

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి పట్టణం వెలంపాళెంకు చెందిన టిడిపి నేత లక్కమనేని మధు రికార్డు సృష్టించారు. వారం రోజుల వ్యవధిలోనే ఆయన వెయ్యికి పైగా సభ్యత్వాలు నమోదు చేయించారు. ఇటీవల ఆయన రూ.లక్ష చెల్లించి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఆ తరువాత తన పరిధిలో గల వార్డుల్లో తన అనుచరులతో కలిసి ముమ్మరంగా తిరుగుతూ సభ్యత్వ నమోదు చేయిస్తున్నారు. తాను చేయించిన సభ్యత్వాలు వెయ్యి దాటడంతో శనివారం సాయంత్రం లక్కమనేని మధు తన కార్యాలయం వద్ద అభిమానులతో కలసి కేక్ కట్ చేశారు. ఈ కేక్ ను టీడీపీ అభిమానులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా లక్కమనేని మధు మాట్లాడుతూ... శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సహకారంతో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. శ్రీకాళహస్తిలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయించాలన్నదే తన ఆశయమన్నారు. టీడీపీలో సభ్యత్వ నమోదు తీసుకోవడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. టీడీపీలో సభ్యత్వం ఉన్న వారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని లక్కమనేని మధు కోరారు. ప్రతి ఒక్కరూ టీడీపీలో సభ్యత్వం తీసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తన చివరి శ్వాస వరకు టీడీపీ శ్రేణుల శ్రేయస్సుకు పని చేస్తానని లక్కమనేని మధు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీంద్ర బాబు, టిడిపి నాయకులు మదన్మోహన్ నాయుడు, 17వ వార్డు టిడిపి మైనార్టీ నాయకులు సాజిద్, టిడిపి యువ నాయకులు సాలపాక్షి నవీన్, సోము, సుధాకర్, చరణ్, పవన్, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు,వంశి, గిరి, ప్రమోద్, భార్గవ్, పురుషోత్తం, అజయ్, హర్షద్, పట్టణంలోని పలు వార్డులకు చెందిన టిడిపి యువత, తదితరులు పాల్గొన్నారు.

# మాలకొండ ను దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి

**వలేటివారిపాలెం పెన్ పవర్ డిసెంబర్ 28**

మాలకొండ లో వెలిసియున్న శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. అనంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఏటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆలయ అధికారులకు సూచించారు . ఆలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య , మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో పోకూరు

**వలేటివారిపాలెం పెన్ పవర్ డిసెంబర్ 28**

పోకూరు గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామం మొత్తం చీకటైంది. దీంతో గ్రామం అంధకారంలో ఉంది. కనీసం రాత్రివేళల్లో గ్రామస్తులు బయటికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు విష పురుగులు రోడ్లపై సంచరిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బ్లీచింగ్ , శానిటేషన్ చేసిన పాపాన పోలేదని చెబుతున్నారు. రాత్రి వేళలో దోమలు తాకిడికి తట్టుకోలేక గ్రామస్తులు అనారోగ్యాలు పాలవుతున్నారని వాపోతున్నారు. కనీసం బ్లీచింగ్ చేయించాలని వారు కోరుతున్నారు. ముందుగా రాత్రివేళల్లో చిన్న చిన్న అవసరాల కోసం బయటకు రావాలంటే చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని చీకట్లో విషపురుగుల తాకిడి గురి కావాల్సి వస్తుందోనని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేసి గ్రామంలో శానిటేషన్ కార్యక్రమాలు చేయాలని వారు కోరుతున్నారు.

# 478 కుటుంబాల్లో వెలుగులు నింపిన ప్రకాశం పోలీసులు

- మిస్సింగ్ అయిన వారిని చాకచక్యంగా పట్టుకొని వారి కుటుంబాలకు అప్పగించిన పోలీసులు
- కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్పీ దామోదర్





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెంపవర్ డిసెంబర్ 29**

జిల్లాకు చెందిన 478 కుటుంబాల్లో ప్రకాశం పోలీసులు వెలుగులు నింపారు. రకరకాల కారణాలతో ఇంటి నుండి వెళ్లిపోయిన 478 మందిని ప్రకాశం పోలీసులు చాకచక్యంగా పట్టుకొని వారి కుటుంబాలకు అప్పగించారు. కొంతమంది అయితే కనపడకుండా పోయిన తమవారి ఆచూకీ లభించక పోవడంతో వారిపై ఆశలు వదులుకున్నారు. అయితే పోలీసులు మాత్రం తప్పిపోయిన వారు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారిని వారి కుటుంబాలకు అప్పగించడంతో ఆ కుటుంబాల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ ఏడాది వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో మిస్సింగ్ అయిన వారిని పట్టుకునేందుకు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో ఒక ఎస్ఐ, ఐదుగురు సిబ్బందితో మిస్సింగ్ అయినవారి కదలికలను గుర్తించి 478 మందిని చాకచక్యంగా పట్టుకొని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ కుటుంబాలకు ముందుగానే నూతన సంవత్సర వేడుకలు వచ్చినట్లయింది. మిస్సింగ్ అయిన వారిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్ వారితో స్వయంగా మాట్లాడారు. ఎందుకు ఇంట్లో నుండి వెళ్ళిపోయారు, అలా వెళ్ళడం వల్ల తల్లిదండ్రులు ఎంత బాధ పడి ఉంటారో ఎస్పీ స్వయంగా వారికి చెప్పి సమస్యలు వస్తే పరిష్కరించుకోవాలి తప్పితే, ఇలా ఇంట్లో నుండి వెళ్ళి తల్లిదండ్రులను బాధ పెట్టవద్దని సూచించారు. అదే సమయంలో కొంతమంది పిల్లలు ఇంట్లో నుండి వెళ్లడంతో, వారి తల్లిదండ్రులకు కూడా ఎస్పీ దామోదర్ హిత బోధ చేశారు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యారనో, మాట వినడం లేదనో, పిల్లల్ని గట్టిగా మందలించవద్దని సూచించారు. ప్రేమగా వారిని దగ్గరకు తీసుకొని శాంతంగా చెబితే పిల్లలు ఇంట్లో నుండి వెళ్లరని ఎస్పీ తల్లిదండ్రులకు చెప్పారు. అనంతరం ఎస్పీ దామోదర్ మీడియాతో మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో 581 మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయని, వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 478 మందిని గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించినట్లు చెప్పారు. వీరిలో 18 మంది అబ్బాయిలు, 104 మంది అమ్మాయిలు ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. 18 సంవత్సరాలు పైబడిన వారిలో 104 మంది పురుషులు, 257 మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఎవరూ క్షణికావేశాలకు గురికాకుండా ఇంట్లో పెద్దవారితో శాంతంగా మాట్లాడితే ఎలాంటి మిస్సింగ్ సంఘటనలు జరగవని ఎస్పీ దామోదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, సబ్ డివిజనల్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయున్ని సన్మానించిన గుంటూరు ఆర్జేడి లింగేశ్వర రెడ్డి



గిద్దలూరు పెన్ పవర్ డిసెంబర్ 28

గిద్దలూరు మండలం పొదిలికొండ పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ప్రధానం చేశారు. శనివారం నాడు పొదిలి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలను పర్యవేక్షించడానికి వచ్చిన గుంటూరు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వర రెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి. పిచ్చయ్యను అభినందించి ఘనంగా సన్మానించారు. ఆర్జేడి మాట్లాడుతూ... పిచ్చయ్య అత్యాధుక బోధనా పద్ధతులను ఉపయోగిస్తూ విద్యాబోధన చేయడమే కాక పాఠశాల విద్యార్థులకు తన వార్షిక వేతనంలో 20 శాతం డబ్బులను ఖర్చు చేసి విద్యాభివృద్ధికి కృషి చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్, మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి జాన్ శ్యాముల్, ఒంగోలు విద్యాశాఖ అధికారి చంద్ర మౌళీశ్వర రావు , రాచర్ల మండల విద్యాశాఖ అధికారులు గిరిధర్ శర్మ, శివ కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు,ఖాన్,మీరావలి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి. పిచ్చయ్యకు అభినందనలు తెలిపారు.

## డిసెంబర్ 31వ తేదీనే పింఛన్ల పంపిణీ



క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 29

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025 జనవరి ఒకటి, రెండవ తేదీలలో ఇవ్వనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నూతన సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని ఒకరోజు ముందుగానే డిసెంబర్ 31వ తేదీన అవ్వ తాతలకు దివ్యాంగులకు, వితంతువులకు, ఒంగోలు నగరం లో పంపిణీ చేయడం జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ దారులు ఏదైనా పనులు నిమిత్తం బయటకు వెళ్లినవారు 31వ తేదీన ఇచ్చే పెన్షన్లను ముందుగా వచ్చి తమ నివాసం వద్ద తీసుకోవాలని అన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి



గిద్దలూరు పెన్ పవర్ డిసెంబర్ 28

మండల కేంద్రమైన గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణము లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అభిబ్ ఖాన్ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటే కార్యక్రమమును శనివారము చేపట్టారు ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ చెట్టును మనము కాపాడితే ఆ చెట్లు మనల్ని కాపాడుతాయని మానవ మనుగడకు అవసరమైన సంపదలో వృక్షరక్షణ ఆవశ్యకతను తెలియచేస్తుందన్నారు వాతావరణ కాలుశ్యం పర్యావరణ పరిరక్షణకు జీవ వైద్యమునకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ గిద్దలూరు కో కన్వీనర్ గుమ్మారాముడు,నీలోజీ సురబయ్య, బోయ పిక్కిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ 9,05,080

వలేటివారిపాలెం పెన్ పవర్ డిసెంబర్ 28

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 9,05,080 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే వి సాగర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా 2,272 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారి నుంచి 2,27,200 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. లడ్డూ ప్రసాదం ద్వారా 1,45,675 ఆదాయం వచ్చింది. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చట్టాలు ,న్యాయ సలహాలు

# మహిళలకు రక్షణ కవచాలు

మహిళలు న్యాయ సమస్యలు వాటి పరిష్కారాలపై అవగాహన కలిగి ఉండాలి.

సమాజంలో మహిళలు చైతన్యవంతులు కావాలి.

పురుషులతో సమానంగా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి.

ఇంకా సమాజంలో మహిళలు వివక్షతకు గురికావడం బాధాకరం.

మహిళలకు రక్షణ సౌకర్యాలు కల్పించేందుకు వంద సంవత్సరాల క్రితమే ప్రత్యేక చట్టాలు అమలులోకి వచ్చాయి.

మహిళలు తమ న్యాయమైన హక్కుల సాధన కొరకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

గిద్దలూరు సీనియర్ న్యాయవాది మొగల్ హాజరాంబి.

కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విధాన్ సే సమాధాన్ (మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు)









కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 28

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు ద్వారా అందిస్తున్న న్యాయ సలహాలు, చట్టాలు మహిళలకు రక్షణ కవచాలుగా ఉపయోగపడగలమని గిద్దలూరు సీనియర్ న్యాయవాది మొగల్ హాజరాం బీ పేర్కొన్నారు .శనివారం కొమరోలు లోని మండల పరిషత్ సమావేశపు హాలులో కొమరోలు మండలం పారా లీగల్ కొడవటికంటి బ్లెస్సింగ్ టన్, ఆర్ఎంపీ వైద్యులు షేక్ ఖాజావలి, గుర్రం సుధీర్ బాబు ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించి వారికి ఉచిత న్యాయ సలహాలు అందించేందుకు విధాన్ సే సమాధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమానికి కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి అధ్యక్షత వహించగా, గిద్దలూరు సీనియర్ న్యాయవాది మొగల్ హాజరాంబీ, కొమరోలు ఎంపీపీ కామూరి అమూల్య పి ఆర్ ఈవో డి బ్రహ్మయ్య, యువ న్యాయవాది ఉస్మాన్ షరీఫ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి ,ఏపీఓ మహాలక్ష్మి దేవి, పంచాయతీ రాజ్ ఏ ఈ ఈరయ్య తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా గిద్దలూరు సీనియర్ న్యాయవాది మొగల్ హాజరాంబిని ఎంపీపీ కావూరి అమూల్య శాలువా, జ్ఞాపకతో సన్మానించారు. అనంతరం హాజరాంబీ మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతులై ,ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి న్యాయ సలహాలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నప్పటికీ ఇంకా మహిళలు అక్కడక్కడ వివక్షతకు గురవుతున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు. మహిళల సాధికార సాధనకు రక్షణ చట్టాలను, న్యాయ సూత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. 1910 నుంచి ఇప్పటివరకు మహిళల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ ,వారికి సౌకర్యాలు తదితర వాటిపై ఎన్నో చట్టాలు రూపొందించబడ్డాయని, అయితే వాటిపై అవగాహన కలిగి ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత మహిళలపై ఉన్నదన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అనేక రంగాలలో పనిచేస్తున్నప్పటికీ, ఇంకా కొన్ని రంగాలలో మహిళలను తక్కువగా చూస్తూ వివక్షతకు గురి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మొట్టమొదటిసారిగా 1910 మార్చి ఎనిమిదవ తేదీన లో అంతర్జాతీయ మహిళ న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారన్నారు. 1922లో బాల్యవివాహాల నిరోధక చట్టం అమలులోకి వచ్చిందని, 1948లో ఫ్యాక్టరీ నిషేధ చట్టం అమలులోకి రావడంతో ఫ్యాక్టరీలలో పనిచేసే మహిళలకు పురుషులతోపాటు మహిళలు సమాన వేతం పొందేందుకు అవకాశం కల్పించబడిందని, అంతేకాక రాత్రి వేళల్లో మహిళలు విధులు నిర్వహించకుండా వెసులుబాటు కల్పించారని పేర్కొన్నారు .1956 లో బాలిక వ్యభిచార నిషేధ చట్టం రూపొందించారని ,అంతేకాక బాల కార్మిక నిరోధక చట్టాన్ని రూపొందించారన్నారు. 1976లో సమాన పనికి పురుషులతో పాటుగా మహిళలకు కూడా సమాన వేతనం కల్పించే చట్టాన్ని అమలు చేశారన్నారు. 1986లో మహిళలపై అసభ్య చిత్రీకరణ నిరోధక చట్టం ,1992లో స్థానిక సంస్థలలో మహిళలు కూడా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ చట్టం, 1994లో భ్రూణ హత్యలు నిషేధం చట్టం ,2005లో గృహింస నిరోధక చట్టం రూపొందించి అమలు చేస్తున్నారన్నారు .2012లో బాలికలపై లైంగిక దాడులు, 2013లో నిర్భయ చట్టం, 2020లో దిశ చట్టం అమలు చేశారన్నారు. మన రాష్ట్రంలో అమలు జరిగిన దిశ చట్టం తో రాష్ట్రవ్యాప్తంగా 18 మహిళా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారని ఆమె పేర్కొన్నారు .వివిధ రంగాలలో, కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళల గౌరవానికి భంగం కలిగించరాదని వారికి రక్షణ కల్పిస్తూ వారి ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తెచ్చాయని ఆమె వివరించారు. వరకట్నం నిషేధ చట్టం అమలు చేసినప్పటికీ ఇంకా సమాజంలో వరకట్నాలు ఇవ్వడం, తీసుకోవడం, వరకట్నాలు ఇంకా తేవాలనే దురాలోచనతో మహిళలను వేధించటం, మానసికంగా, శారీరకంగా కృంగిపోయి వారు ఆత్మహత్య చేసుకునేందుకు కారకులు కావడం లాంటి దుశ్చర్యలు జరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కుల సాధనకు న్యాయ సూత్రాలను తెలుసుకొని ముందుకు సాగాలని , మహిళలు, బాలికలపై టీవీలలో ప్రసారమవుతున్న సీరియల్ ల ప్రభావం సెల్ ఫోన్ లో ప్రభావం ఎక్కువగా పడుతున్నదని అందువల్ల మహిళలు, బాలికలు, యువతులు అవసరమున్నంతవరకే టీవీలను, సెల్ఫోన్లను వినియోగించుకోవాలన్నారు. తాను న్యాయవాదిగా వృత్తి చేపట్టిన తరువాత అన్యాయానికి గురైన ఒక మహిళకు న్యాయం చేసేందుకు ఆమె కేసును ఉచితంగా వాదించి ఆ మహిళకు న్యాయం చేశానని ఆమె సగర్వంగా చెప్పారు. దీనితో సభికులు హర్షధ్వానాలు చేశారు. మహిళలందరూ తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి న్యాయపరమైన సూత్రాలు కల్పించేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహిళలకు ఉచిత న్యాయ సలహా సదస్సులు నిర్వహిస్తున్నట్లుగా ఆమె తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె మహిళలకు విజ్ఞప్తి చేస్తూ అనేక విషయాలను వివరించి అవగాహన కల్పించారు .కార్యక్రమంలో ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ, మహిళలు బాలికల రక్షణ కొరకు గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిశ చట్టాన్ని అమలులోకి తెచ్చి, సమర్థవంతంగా అమలు చేశారని అంతేకాక మహిళలు, బాలికలు, యువతులు అందరితో దిశ యాప్ ను డౌన్లోడ్ చేయించారని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 18 మహిళా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించి ముందుకు సాగేందుకు ప్రతి మహిళ ముందుగా విద్యావంతులు కావాలని, దీనితో సమస్యల పరిష్కారంతోపాటు ఇంటిలో విద్యా వెలుగులు ప్రసరిస్తాయని ఆమె పేర్కొన్నారు .తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన ,చదువు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా బాలికలు పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే సమయం ఎదుర్కొనే సమస్యల తెలుసుకుంటూ బాలికల చదువు క్రమశిక్షణతో ముందు సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా భావించి మహిళలు బాలికలు ఇటీవల కాలంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ,అయితే సమస్యలకు పరిష్కారం ఆత్మహత్యలు కాదని ధైర్యంగా సమస్యలు ఎదుర్కొని వాటిని పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు .ప్రతి మహిళ ,ప్రతి బాలిక ప్రతి యువతి భారతీయ సాంప్రదాయ ,సంస్కృతులను అవగాహన చేసుకుని వాటిని గౌరవిస్తూ అమలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు .ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి మాట్లాడుతూ మహిళలు యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డారని, అయితే సమాజంలో ఎదురవుతున్న అనేక సమస్యలను అధిగమించేందుకు న్యాయపరమై సలహాలను ,చట్టాలను తెలుసుకోవాలన్నారు. బాల్యవివాహాల లో ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉన్నదని, అయితే బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేయాలని ఆమె కోరారు .ముఖ్యంగా తల్లిదండ్రులు ఆర్థిక సమస్యలతో లేదా ,తమ బాలికల ప్రవర్తనలో వచ్చిన మార్పులతో భయపడి బాల్య వివాహాల నిర్వహిస్తున్నారని ఆమె చెప్పారు. బాల్య వివాహాలు చేయటం, ప్రోత్సహించడం కూడా చట్టరీత్యా నేరమని ఆమె వివరించారు .బాలికలను నివేదించడం, కిడ్నాప్ చేయడం, అక్రమ రవాణా చేయటం ,చట్టరీత్య నేరమని అలాంటి అక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి పోలీసులకు తెలియజేయ వలసిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. ఎంపీడీవో మస్తాన్వలి మాట్లాడుతూ మహిళలు చట్టాలు, న్యాయ సూత్రాలపై సమగ్ర అవగాహన కల్పించుకొని తమ హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా తమ చిన్నారుల చదువు ప్రవర్తన తదితర వాటిపై శ్రద్ధ వహించాలన్నారు .ఎక్కువ సమయాన్ని టీవీలు చూస్తూ విలు వైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని, అంతేకాక ఆరోగ్యపరమైన సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు .ఆ కార్యక్రమంలో కొమ రోలు పారా లీగల్ కొడవటి కంటి బ్లెస్సింగ్ టన్ షేక్ ఖాజావలి గుర్రం సుధీర్ బాబు, గిద్దలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బంది ఉషశ్రీ, ఎన్జీవో, పారా లీగల్ చిట్లూరి ఏలియా (కంభం), కత్తి అన్నోజి రావు (రాచర్ల)డి. ఏబు (అర్ధవీడు )తోపాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయం

### ఎంపిటిసి బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి





పెన్ పవర్ పామూరు డిసెంబరు 28

స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ సమకూర్చిన లక్ష్మీ నరసాపురం హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని అన్నారు. శనివారం ప్రధానోపాధ్యాయులు షేక్. ఈషాక్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ బొల్లా. నరసింహ రావు మాట్లాడుతూ నాయబ్ రసూల్ స్వయంకృషి సేవా సంస్థను స్థాపించి విద్యార్థుల సంక్షేమం కోసం విద్యాభివృద్ధికి సహాయం చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని వారు ఉత్తమ పౌరులుగా తయారై దేశ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి 10 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పి మస్తాన్ రావు స్టడీ మెటీరియల్ కు ఆర్థిక సహాయం అందజేయడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాచూరి ఏలియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు అధికారులకు అసోసియేషన్ డైరీ అందజేత



క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిశంబరు 28

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు ఆవిష్కరించిన రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ-2025 ను శనివారం జిల్లా పోలీస్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ పోలీస్ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులు సిబ్బంది తమ విధులను క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వర్తించి, శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డిఎస్పీలు రాయపాటి.శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, ఉప్పుటూరి నాగరాజు, మహేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఐటీ కోర్ సిఐ సూర్యనారాయణ, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, తిరుపతి స్వామి, షేక్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరి ఎరిక్షన్ బాబు తీరు తెలుగుదేశం పార్టీకినష్టం

**ఇన్ చార్జ్ వైసిపి వాళ్ళకు పనులు చేస్తు టిడిపి నాయకులకు ద్రోహం చేస్తుదని విమర్శలు**

**గూడూరిఎరిక్షన్ బాబు వల్ల నిజమైన కార్యకర్తలు పార్టీకి దూరమవుతున్నారని వెల్లడి**

**జనసేన పార్టీ నాయకులంటే ఎరిక్షన్ బాబు గౌరవం ఇవ్వడం లేదంటు రుసరుసలు.**

**ఎరిక్షన్ ఒంటెద్దుపోకడ వల్ల నియోజకవర్గంలో టిడిపి డీలా**







**త్రిపురాంతకం పెన్ పవర్ డిసెంబర్ 28**

నియోజకవర్గ టిడిపి ఇన్ చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఒంటెద్దు పోకడవల్ల తెలుగుదేశం పార్టీ విజయం కోసం పాటుపడిన నిజమైన నాయకులు కార్యకర్తలు నష్టపోతున్నారని.త్రిపురాంతకం మండల టిడిపి నాయకులు కార్యకర్తలు విమర్శించారు.శనివారం నియోజకవర్గ ఇన్ చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తెలుగుదేశం పార్టీకి నాయకులకు ద్రోహం చేస్తున్నారని ,అధిష్టానంలోని పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సుమారు50 వాహనాలలో అమరావతికి బయలుదేరివెళ్ళడం చర్చాంశనీయంగా మారింది.గతంలో యర్రగొండపాలెం నుండి 50 వాహనాలలో, పెద్దదోర్నాల మండలం నుండి50 వాహనాలలో నాయకులు కార్యకర్తలు మహిళలు తరలివెళ్ళారని,అలాగే శనివారం త్రిపురాంతకం మండలం నుండి కూడా భారిగా ఎరిక్షన్ బాబుకు వ్యతిరేకంగా వెళ్ళడంతొ నియోజకవర్గంలోని తెలుగుదేశంలో ఈన్న వర్గపోరు మరో సారి బహిర్గతం అయ్యింది.త్రిపురాంతకం మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఊట్ల సీతారామయ్య మాట్లాడుతు తాను పార్టి ఆవిర్భావం నుండి పార్టికోసం పనిచేస్తున్నానని ఇన్ చార్జ్ మమ్మల్ని కాదని వైసిపి నుండి వచ్చిన వారికి ప్రాదాన్యతఇచ్చి మాపై అక్రమ కేసులు బనాయిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసాడు.కనీసం మా ఫోన్లు ఎత్తడు మాతొ కలవడంలేదని ఎరిక్షన్ బాబు ఒంటెద్దుపోకడ మానుకోకపోతే రేపు జరగపోయే పంచాయితి ఎన్నికలలో ఎవరీ పార్టికి పని చేయడని తెలిపారు. గ్రామపార్టి ఇన్ చార్జ్ మార్తయ్య మాడ్లాడుతు నేను అనేక సార్లు గూడూరి ఎరిక్షన్ బాబును కలిసానని ఏసమస్య చెప్పిన పట్టించుకోడు కనీసం కార్యకర్తలకు మర్యాధకూడా ఇవ్వడని అన్నారు.మూడు సాగర్ ట్యాంకులు ఉంటే దర్శిలోని వారి బంధువులకు అప్పగించి స్దానిక కార్యకర్తలకు అన్యాయం చేసాడని ,అలాగే రేషన్ బియ్యం మాఫియాలో,లిక్కర్ మాఫియా కమీషన్లు దండుకుంటు పార్టికి చెడ్డపేరు తెస్తున్నాడని ఈ విషయాంపై ముఖ్యమంత్రి చంద్రబాబుదృష్టికి,నారాలోకేష్ దృష్టికి తీసుకువెళుతున్నామన్నారు.జనసేన జిల్లాఅధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు మాట్లాడుతు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయిన తమకు నియోజకవర్గంలో విలువదని ,గూడూరి ఎరిక్షన్ బాబు తీరువల్ల జనసేన పార్టి కార్యకర్తలు నాయకులు నష్టపొతున్నారని,జనసేన అంటేనే అధికారపార్టి కార్యక్రమాలకు దూరంగా పెడుతు స్వంత నిర్ణయాలతో గ్రూపు రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు.త్రిపురాంతకం మండల నాయకులు నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతిని,పార్టికి వస్తున్న చెడ్డపేరును పార్టి పెద్దలకు వివరించేందుకు భారిగా తరలివెళ్ళారు.

## పొదిలిలో వాజ్ పాయి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

**మునిసిపల్ కమిషనర్ కు బిజెపి నాయకుల వినతి**



**పొదిలి, పెన్ పవర్ డిసెంబర్ 28**

దివంగత భారత మాజీ ప్రధాని, రాజనీతిజ్ఞుడు అటల్ బిహారీ వాజ్ పేయ్ విగ్రహ ఏర్పాటుకు పట్టణంలో స్థలం కేటాయించాలని బిజెపి నాయకులు పొదిలి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులును కోరారు. శనివారం నాడు బిజెపి నాయకులు కమిషనర్ కు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, అమరావతి ఫౌండేషన్ చైర్ పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కమిషనర్ శ్రీనివాసులు కలసి వాజ్ విగ్రహ ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, మండల బిజెపి అధ్యక్షులు ఎస్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సయ్యద్ ఖాదర్ భాష, పి నారాయణ, పందిటి మురళి, భవాని శ్రీను, డి రమణారెడ్డి, యు మహేష్, వెంకట కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

***30న గుడ్లూరు హైస్కూలులో మండలస్థాయి సైన్స్ ఫెయిర్***





**గుడ్లూరు, పెన్ పవర్, డిసెంబరు 28**

పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్ ఫెయిర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని అన్నీ పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు స్కూల్ లెవెల్ లో సైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరిగినదని మండల విద్యా అధికారి ఎం.గోవర్ధన్ శనివారం తెలిపారు. స్కూల్ లెవెల్ లో జరిగిన సైన్స్ ఫెయిర్ నుండి వ్యక్తిగత విభాగం, గ్రూప్ విభాగం, టీచర్ విభాగం అను మూడు విభాగాలలో నిర్వహించారు. ఈ సైన్స్ ఎక్జిబిషన్ నుండి స్కూల్ లెవెల్ లో మొదటి స్థానంలో నిలిచిన వారికి ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుడ్లూరు నందు జరుగు మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కి హాజరు కావాలని, మండలంలోని ప్రధానోపాధ్యాయులు అందరిని కోరడమైనదని ఎం.ఈ.ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికి గుడ్లూరు హైస్కూలు నందు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంఇఓ గోవర్ధన్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## నీటి సమస్య తీర్చిన సర్పంచ్

**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 28**

పుల్లల చెరువు మండలం గంగవరం గ్రామం ఎస్సీ పాలెంలో నీటి సమస్య తీర్చిన సర్పంచ్ జన్నవరపు వెంకట రామిరెడ్డి.తమకు తాగునీటి సదుపాయం కల్పించాలని ఇటీవల గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించేందుకు బోరు వేయించారు.దీంతో గ్రామస్థుల ఆనందానికి అంతులే కుండా పోయింది,చేసిన ఉపకారం ఎన్నడూ మరువలేనిదని వారు అన్నారు. ఎన్నో యేళ్ళుగా నీటి ఎద్దడితో అల్లాడి పోతున్న దళిత వాడ ప్రజల కష్టాలు తెలుసుకొని సర్పంచ్ నిధులతో మంచినీరు బోరు వేయించి నీటి సమస్య తీర్చినందుకు సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత వాడ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



## విద్యుత్ చార్జీల పెంపు పాపం... జగన్ దే!

**పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు కుద్దూస్**




**పొదిలి, పెన్ పవర్ డిసెంబర్ 28**

రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు పాపం పూర్తిగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేనని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తీవ్రంగా విమర్శించారు శనివారం సాయంత్రం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ అవినీతి వల్ల 1,29, వేల కోట్లు పెరిగాయని చెప్పారు ఇబ్బడి ముబ్బడిగా విద్యుత్ చార్జీలు పెంచి, ధర్నాలు చేయడం ప్రజలను మోసగించడమేనని ఆయన ఆక్షేపించారు 20 14 లో 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో చంద్రబాబు పాలన ప్రారంభమైందని, 20 19 లో తెలుగు దేశ ప్రభుత్వం మిగులు విద్యుత్ తో జగన్ చేతిలో ప్రభుత్వాన్ని పెట్టడం జరిగిందన్నారు అయితే జగన్ ప్రభుత్వ అవినీతి కక్ష సాధింపు విధానాల వల్ల విద్యుత్ రంగం భ్రష్టు పట్టిపోయిందని కుద్దూస్ విమర్శించారు తన ఐదేళ్ల పాలనలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై 32 వేల కోట్ల భారం మోపిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు 20 21 వరకు కూడా పూర్తి కాకపోవడం వల్ల 4, 737 కోట్ల నష్టం జరిగిందని ఆయన వివరించారు అలాగే జెన్కో విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోవటానికి విజయసాయిరెడ్డి సరఫరా చేసిన నాసిరకం బొగ్గు కారణమని కుద్దూస్ ఆరోపించారు విద్యుత్ సంస్థలపై 49 వేల కోట్లకు పైగా అప్పులు చేసిన ఒక్క కొత్త విద్యుత్ ప్లాంటును కూడా జగన్ ప్రభుత్వంలో నిర్మించడం జరగలేదన్నారు అంతేగాక అంతేగాక ట్రాన్స్ఫార్మర్లు స్మార్ట్ మీటర్లు ఇలాంటి విద్యుత్ పరికరాలను అధిక రేట్లకు కొనుగోలు చేసి అప్పటి వైసీపీ నాయకులు కమిషన్లతో తమ జేబులు నింపుకున్నారని ఆయన విమర్శించారు అన్ని విధాల నిర్మాణం పూర్తి చేసుకున్న కృష్ణపట్నం వీటి పిఎస్ లను సకాలంలో ప్రారంభించకుండా, జగన్ ప్రభుత్వం విద్యుత్ కొరతను కావాలని సృష్టించి, కమిషన్ల కోసం బహిరంగ మార్కెట్లో అధిక రేట్లకు విద్యుత్తును కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వానికి 2700 కోట్లు నష్టం వాటిలిందని కుద్దూస్ చెప్పారు సే కి ఒప్పందంలో 1750 కోట్లు లంచాలు పుచ్చుకున్నారని జగన్ పై అమెరికా కోర్టులో కేసు నమోదు కావడం జరిగింది వాస్తవం కాదా అని కుద్దూస్ ప్రశ్నించారు తన అవినీతి అసమర్థ విధానాల వల్ల జగన్ ప్రభుత్వంలో విద్యుత్ రంగం అన్ని విధాల నష్టపోయిందని విద్యుత్ రంగాన్ని అడ్డం పెట్టుకొని వేలకోట్లు అక్రమంగా ఆర్జించిన జగన్మోహన్ రెడ్డి ప్రజలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తూ ధర్నాలకు దిగడం విడ్డూరంగా ఉందని కుద్దూస్ అపహాస్యం చేశారు అపార పరిపాలన అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మళ్లీ విద్యుత్ రంగం కోలుకుంటుందని కుద్దూస్ చెప్పారు సమావేశంలో తెలుగుదేశం నాయకులు కాటూరి శ్రీను, షేక్ అల్లా బకాష్, ఎస్ ఖాదర్ వలీ, మునగపాటి ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషల్ శిశు ఆధార్ క్యాంప్ నిర్వహణ

**35 మంది పసిపిల్లలకు ఆధార్ అప్డేట్ చేసిన కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు సూరే జయపాల్.**
**శిశు ఆధార్ స్పెషల్ క్యాంపుకు ప్రారంభోత్సవం చేసిన కొమరోలు పిహెచ్సి వైద్యాధికారి చల్లగాలి చైతన్య దీపక్,**
**ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి - పసిపిల్లలతో భారీగా తరలివచ్చిన తల్లిదండ్రులు.**
**సర్వర్ మొరాయించటంతో నిరాశగా వెను తిరిగిన పలువురు తల్లిదండ్రులు.**
**సోమవారం కూడా క్యాంపు నిర్వహించి తమకు సౌకర్యం కల్పించాలని పలువురు విజ్ఞప్తి.**



**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 28**



కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన శిశు ఆధార్ స్పెషల్ క్యాంపులో 35 మంది పసిపిల్లలకు ఆధార్ అప్డేట్ చేసినట్లుగా పీహెచ్సీ వైద్యాధికారి చైతన్య దీపక్, కొమరోలు కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు సూరే జయపాల్ తెలిపారు. జిల్లా సిఎస్ సి మేనేజర్లు వందనం ,ప్రమోదుల ఆదేశాల మేరకు కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చైతన్య దీపక్ ఆధ్వర్యంలో శనివారం కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషల్ శిశు ఆధార్ అప్డేట్ క్యాంపును నిర్వహించారు .ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిహెచ్సి వైద్యాధికారి చల్లగాలి చైతన్య దీపక్ ,ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి తదితరులు గా పాల్గొన్నారు. ఆ సందర్భంగా వైద్యాధికారి చైతన్య దీపక్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు బాల బాలికలందరికీ ఆధార్ అప్డేట్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ ఆరోగ్య కేంద్రంలో స్పెషల్ శిశు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు .కావున మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ చిన్నారులను క్యాంపుకు తరలించి ఆధార్ అప్డేట్ చేయించుకోవటం హర్షనీయం, అభినందనీయమని అన్నారు. ఐదు సంవత్సరాలు ఒక చిన్నారులకు ఆధార అభివృద్ధి చేయించుకోవడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత కుమార్ మాట్లాడుతూ, మండలంలోని అంగన్వాడి కేంద్రాల టీచర్లు ,ఆయాలు శిశు ఆధార్ స్పెషల్ క్యాంపుపై విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని తాము కోరామని ,ఆ మేరకు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు విస్తృత ప్రచారం చేశారని తెలిపారు. స్పెషల్ ఆధార్ శిశువు క్యాంపును విజయవంతం చేసిన అంగన్వాడి టీచర్లను ఆమె అభినందించారు .స్పెషల్ శిశువు ఆధార్ క్యాంపును కొమరోలు లోని కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు సూరే జయపాల్ తమ సిబ్బందితో నిర్వహించారు. శిశు ఆధార్ స్పెషల్ క్యాంపుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తల్లిదండ్రులు తమ చిన్నారులతో తరలివచ్చారు. వారిలో 35 మంది చిన్నారులకు ఆధార్ అప్డేట్ చేశారు. అయితే శనివారం సాయంత్రం నుంచి సర్వర్ మొరాయించటంతో ఆధార్ అప్డేట్ కార్యక్రమానికి అంతరాయం కలిగింది. దీనితో చాలామంది తల్లిదండ్రులు నిరాశగా తమ చిన్నారులతో వెను తిరగవలసి వచ్చింది. కాగా సోమవారం కూడా ఆధార్ శిశు స్పెషల్ క్యాంపును నిర్వహించి ,తమ చిన్నారులకు కూడా ఆధార్ అప్డేట్ సౌకర్యం కల్పించాలని పలువురు తల్లిదండ్రులు డాక్టర్ చైతన్య దీపక్ కు విజ్ఞప్తి చేశారు. ఆ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమణమ్మ, సుబ్బరత్నం, రాజ్యలక్ష్మి, సిద్ధమ్మ, కరీమున్ ,అరుణకుమారి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**డిప్యూటీ తహసిల్దార్ కిరణ్**



**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 28**

గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసిల్దార్ కిరణ్ అన్నారు. శనివారం మండల కేంద్రము గాంధీ బొమ్మ సెంటర్ లో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సభలు వేదిక కానున్నదని, ప్రజలు సభలను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.గతంలో ఏమైనా రెవెన్యూ సమస్యలు ఉంటే వాటి పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అలా కాకుండా నేరుగా రెవెన్యూ యంత్రాంగమే తమ గ్రామానికి వచ్చి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తోందన్నారు. అంతేకాకుండా స్వీకరించిన అర్జీలను గడువులోపు పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాధితులంతా తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు. అనంతరం బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేర్ రాములు నాయక్, విఆర్ఓ కోటేశ్వరరావు,గ్రామ సర్పంచ్ బడిపాటి ఓబులేసు, ఎంపీటీసీ రాధ, నీటి సంఘం అధ్యక్షుడు కొలకలూరి కుమార్, టీడీపీ సినీయర్ నాయకులు లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ ఇదెమ్మ, అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## సిఏ జవహర్ బాబుపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన

**దొనకొండలో డిసెంబర్ 28 పెన్ పవర్**

మండల కేంద్రంలో అభివృద్ధి అధికారి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వివరాల్లోనికి వెళ్ళగా 27వ తేదీ శుక్రవారం అన్నమయ్య జిల్లా గాలివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సి ఎ జవహర్ బాబు పై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన తెలిపిన దొనకొండ మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఎం శ్రీదేవి ఏవో దావూద్ ఎంపీడీవో ఆఫీస్ ఉద్యోగులు ఎంఈఓ సాంబశివరావు సిడిపిఓ భారతి విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ కుమార్ ఏపీవో దేవయ్య రెవెన్యూ శాఖ అధికారి బాజీ తదితరులు పాల్గొని నిరసన వ్యక్త పరచడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబు పై దాడి ఘటనను నిరసన వ్యక్తపరుస్తూ శుక్రవారం జరిగిన దాడి ఘటనలో గాయపడి ప్రభుత్వ కడప రిమ్స్ జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో సిఐ జవహర్ బాబును దాడి కి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు విద్య నిర్వహణలో ఉన్న సీఏ జోహార్ బాబుకు జరిగిన దాడిని అప్రజా స్వామిక చర్యగా పరిగణిస్తున్నామని ఇటువంటి దౌర్జన్యాలు రౌడీ చర్యలకు తావు ఇవ్వకూడదంటూ బాధ్యత ఎంపీడీవోకు మెరుగైన వైద్యం అందించాలని నిందితులను కఠినంగా వ్యవహరించాలని వారు తెలిపారు.



# ఐటీ హబ్ దిశగా అడుగులు...



**విజయవాడ, డిసెంబర్ 28, పెన్ పవర్:** రాబోయే ఐదేళ్లలో ఏపీని ఐటి హబ్‌గా మార్చేందుకు మంత్రి లోకేష్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలతోపాటు ఉపాధి కల్పన సబ్ కమిటీ ఛైర్మన్‌గా లోకేష్ రాష్ట్రానికి పరిశ్రమలు రప్పించేందుకు కృషి చేస్తున్నారు. 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పని చేస్తున్నారు.గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవంతో నారా లోకేష్.. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. పెద్దఎత్తున పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా.. డీప్ టెక్‌ను అభివృద్ధి చేసి.. తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని లోకేష్ సంకల్పించారు. ఇందులో భాగంగా ఇన్నొవేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఫిజిక్స్ వాలాతో ఎంవోయూ కుదుర్చుకున్నారు.

1.గత ఆరు నెలలుగా లోకేష్ చేసిన కృషి ఫలితంగా గూగుల్ క్లౌడ్, టీసీఎస్ వంటి కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను స్థాపించేందుకు ముందుకు వచ్చాయి.

2.ఇప్పటికే 5 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న హెచ్‌సీఎల్, మరో 15 వేల ఉద్యోగాలు కల్పించేలా సంస్థను విస్తరించడానికి ముందుకు వచ్చింది. లోకేష్‌తో చర్చల అనంతరం ఫాక్స్ కాన్ సిటీ ఏర్పాటుకు ఆ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది.

3.ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అక్టోబర్ 25 నుంచి వారంరోజుల పాటు లోకేష్ అమెరికాలో పర్యటించారు. సిలికాన్ వ్యాలీ, సీటెల్, న్యూయార్క్‌తో సహా ప్రధాన అమెరికా నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలపై ప్రపంచస్థాయి టెక్నాలజీ సంస్థల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో చర్చలు జరిపారు.

4.టెస్లా, గూగుల్, యాపిల్, అడోబ్, మైక్రోసాఫ్ట్, ఫాల్కాన్ ఎక్స్, సేల్స్ ఫోర్స్, జడ్ స్కాలర్ వంటి 100 ప్రముఖ కంపెనీల ప్రతినిధులను కలిసి.. రాష్ట్రంలో ఆయా సంస్థల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించారు.

5.ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో నూతన ఐటీ, ఎలక్ట్రానిక్స్ పాలసీలను లోకేష్ ప్రకటించారు. దేశంలో మరే రాష్ట్రంలోని లేని విధంగా ప్రోత్సాహకాలతో 2024-29 సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ తయారీ విధానం, ఆంధ్రప్రదేశ్ సెమీకండక్టర్ అండ్ డిస్ప్లే ఫ్యాబ్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ పాలసీలను ప్రకటించారు.

6.కేవలం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ పరిశ్రమలపైనే కాకుండా.. ఇతర భారీ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించేందుకు లోకేష్ ప్రయత్నాలు చేస్తున్నారు. లోకేష్ చొరవతో రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు టాటా గ్రూప్ సిద్ధమైంది.

7.రాష్ట్రంలో రూ.65 వేల కోట్లతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్ల స్థాపనకు రిలయన్స్ ఎనర్జీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఆదిత్యమిట్టల్‌తో మంత్రి లోకేష్ జరిపిన వీడియోకాల్ చర్చలు ఫలించాయి. రెండుదశలుగా రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో రూ. 1,40,000 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆర్సెలర్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ జాయింట్ వెంచర్ ముందుకు వచ్చింది. జనవరిలో రాష్ట్రంలో పర్యటించనున్న ప్రధాని నరేంద్రమోదీ అనకాపల్లి వద్ద ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేయనున్నారు.

8.ముంబయిలో మంత్రి లోకేష్ జరిపిన చర్చల ఫలితంగా.. వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికీ గోల్డ్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తంచేసింది. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ.60 వేల కోట్లతో 10వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులను స్థాపించేందుకు ఆ సంస్థ సిద్ధమైంది.

9.రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో సైతం కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు లోకేష్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ కింద చేపట్టిన 3 ప్రాజెక్టుల కోసం.. మొబైల్ టవర్లు, రైట్ ఆఫ్ వే కోసం భూమి కేటాయింపులు, అనుమతులు మంజూరు చేశారు. గిరిజన, గిరిజనేతర మారుమూల ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, పరిష్కారానికి కృషిచేస్తున్నారు.

10.రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ అమలులో భాగంగా జీవోల జారీ రిజిస్టర్ పోర్టల్‌ను పునరుద్ధరించారు. ఈ-కేబినెట్ ప్రాజెక్టుని విజయవంతంగా అమలు చేస్తున్నారు. పౌరులకు సంబంధించిన 134న రకాల సర్టిఫికెట్లను వాట్సాప్ ద్వారా అందించేలా మెటాతో కీలక ఒప్పందం చేసుకున్నారు.

# కర్ణాటకలో అలా... విశాఖలో ఇలా

**విశాఖపట్టణం, డిసెంబర్ 28, పెన్ పవర్:** ప్రజల పోరాటానికి, వారి సెంటిమెంట్‌కు భిన్నంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. ఇదే సమయంలో నష్టాల్లో ఉన్న కర్ణాటకలోని స్టీల్‌ప్లాంట్‌కు రూ.15 వేల కోట్లు ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధంగా ఉంది. వైజాగ్ స్టీల్‌ప్లాట్ పట్ల కేంద్ర ప్రభుత్వ వివక్ష పట్ల అధికార టీడీపీ, జనసేన కనీసం స్పందించటం లేదు. టీడీపీ, జనసేన పార్టీల వైఖరిపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.కర్ణాటకలోని భద్రావతిలో ఉన్న చారిత్రాత్మకమైన సర్ ఎం. విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు.. కేంద్ర ప్రభుత్వం రూ.15,000 కోట్లు వెచ్చించనుంది. ఈ ప్రణాళికలను కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ధ్రువీకరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక, ఉపాధి వృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు.ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ఎటువంటి పునరుద్ధరణ చర్యలు చేపట్టడం లేదు. పైగా ప్లాంట్‌ను మరింత నష్టాల్లో కూరుకుపోయే విధంగా చేసేందుకు ఒక్కో విభాగంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రైవేటీకరణ కానివ్వబోమని హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. సీఎం చంద్రబాబు ఆఫ్ ది రికార్డు పేరుతో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న సందర్భంలో.. నష్టాల్లో ఉన్నప్పుడు ఏం చేస్తామని అంటున్నారు.పవన్ కళ్యాణ్ అయితే ఏకంగా మాట్లాడటమే మానేశారు. పక్క రాష్ట్రంలో నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు రూ.15 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నప్పుడు, రాష్ట్రంలోని స్టీల్‌ప్లాంట్‌కు ఎటువంటి ఆర్థిక సాయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. కానీ రాష్ట్రంలోని అధికార టీడీపీ, జనసేన మాత్రం కనీసం మాట్లాడం లేదు. కేంద్రంలో మంత్రి పదువులు తీసుకున్న టీడీపీ ఎందుకంత అలసత్వం ప్రదర్శిస్తోందో తెలియడం లేదు. వైజాగ్ ఎంపీ భరత్ కానీ, గతంలో స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కానీ కనీసం స్పందించటం లేదు.ఇప్పుడు మరోకొత్త స్టీల్‌ప్లాట్ అంశాన్ని ముందుకు తీసుకొచ్చారు. ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు సిద్ధపడిన చంద్రబాబు, ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఖనిజం ఇవ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరుతున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సమీపంలో అనకాపల్లిలో నక్కపల్లిలో ఏర్పాటు కానున్న ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మద్దతు ఇస్తున్నారు. అంటే దీన్ని బూచిగా చూపించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఖతం చేయాలని చూస్తున్నారని కార్మిక సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.వాస్తవానికి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు దగ్గర స్టీల్‌ప్లాంట్ పెట్టడం శ్రేయస్కారం కాదు. ఎందుకంటే ఇప్పటికే ఒక భారీ స్టీల్‌ప్లాంట్ అక్కడ ఉంది. దీనివల్ల కొత్తగా పెట్టే స్టీల్‌ప్లాంట్‌కు లాభం రాదు. ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్‌కు సమీపంలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ పెట్టేందుకు ముందుకు రావడం, అందుకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడంలోనే వారి ఉద్దేశ్యం స్పష్టం అవుతోందని కార్మిక సంఘాల నేత నర్సింగ్ రావు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడంలోని భాగమే ఈ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు మద్దుతు ఇవ్వడమని పేర్కొన్నారు.వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఖనిజం కేటాయించాలని, ముడి ఖనిజం లేకపోవడంతోనే అక్కడ ఇబ్బందులు వస్తున్నాయని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. కానీ ఇంకా ఏర్పాటే కాని ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ముడి ఖనిజం ఇవ్వాలని రాష్ట్ర

ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరుతున్నారని అన్నారు.ఇటీవలి ప్రధానిని కలిసిన సీఎం చంద్రబాబు.. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాజెక్టుకు అవసరమైన ముడి ఖనిజం సరఫరా అయ్యేలా చేడాలని ప్రధానిని కోరారు. దీంతో పాటు ఈ సంస్థ ఏర్పాటుకు వివిధ శాఖలకు సంబంధించి అనుమతులు త్వరితగతిన వచ్చేలా చూడాలని విన్నవించారు. సాంకేతిక ఇబ్బందులు తొలగితే ప్రాజెక్టు వేగంగా పట్టాలు ఎక్కుతుందని, దీనికోసం సహకరించాని సీఎం కోరారుకానీ ప్రధాని మోదీ వద్ద సీఎం చంద్రబాబు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం మాట్లాడ లేదు. దీనిపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. వైజాగ్ లాంటి ప్రాంతాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు కూడా జరిగాయి. చంద్రబాబు వైఖరి మోసపూరితంగా ఉందని సీఐటీయూ నేతలు విమర్శించారు. ఎన్నికల ముందు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కాపాడేందుకు హామీ ఇచ్చారని, ఇప్పుడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ గురించి కాకుండా, ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ గురించి ప్రధాని వద్ద డిమాండ్ చేయడం దారుణమన్నారు.

# డెడ్ బాడీ పార్శిల్ లో విస్తుపోయే నిజాలు

**విజయవాడ, డిసెంబర్ 28, పెన్ పవర్:** ఉండిలో డెడ్‌బాడీ డోర్ డెలివరీని కేసును పోలీసులు చేధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్ వర్మ అలియాస్ సుధీర్ వర్మతో పాటు అతని రెండో భార్య రేవతి మూడో భార్య సుష్మలను అరెస్ట్ చేశారు. రేవతి అక్క తులసి పేరిట ఉన్న ఆస్తి కోసం అమాయకుడిని హత్య చేసి ఆ శవాన్ని మహిళ ఇంటికి పార్సిల్ పంపి ఆపై బెదిరింపులకు పాల్పడినట్టు గుర్తించారు. నిందితుల వివరాలను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ నయీం అస్మీ వెల్లడించారు.ఉండి మండలం యండగండి గ్రామంలో ముదునూరి రంగరాజు నివాసానికి చెక్క పెట్టెలో మృతదేహం డెలివరీ చేసిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సొంత వదినను బెదిరించి భయపెట్టడానికి గ్రామానికి చెందిన పర్లయ్యను హత్య చేసి చెక్కపెట్టెలో డెలివరీ చేసినట్టు నిందితులు అంగీకరించారు. నిందితుడి రెండో భార్య రేవతి అక్క పేరుతో ఉన్న మూడెకరాల పొలం కోసమే ఈ డ్రామా నడిచినట్టు జిల్లా పోలీసులుప్రకటించారు.గ్రామానికి చెందిన పర్లయ్యను ప్రధాన నిందితుడు తిరుమాని శ్రీధర్ వర్మ హత్య చేసి చెక్కపెట్టెలో తన మూడో భార్య సాయంతో ఆటోలో తులసి ఇంటికి పంపినట్టు గుర్తించారు.శ్రీధర్ వర్మ రెండో భార్య రేవతి అక్క సాగి తులసి పేరిట ఉన్న మూడెకరాల పొలాన్ని కాజేయడానికి ఈ హత్యకు పాల్పడినట్టు గుర్తించారు.చెక్క పెట్టెలో శవాన్ని పంపి హత్య కేసులో ఇరుక్కుంటావని బెదిరించి ఆమెను బెదిరించే ప్రయత్నం బెడిసికొట్టింది. నిందితుడు శ్రీధర్‌వర్మ కూలీ పనికోసం వచ్చిన కాళ్ల గ్రామానికి చెందిన గాంధీనగరం వాసి బర్రె పర్లయ్యను నిందితుడు శ్రీధర్ వర్మ గొంతుకు ఉరి బిగించి హత్య చేశాడు. కాళ్ల మండలం కోపల్లె నుంచి ఉండి వచ్చే వాంద్రం దారిలో పర్లయ్యను నిందితుడు హత్య చేశాడు.కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం మల్లంపూడి గ్రామానికి చెందిన తిరుమాని శ్రీధర్ వర్మ అమ్మాయిలకు వల వేయడంలో దిట్ట. శ్రీధర్ వర్మకు మొదట ఎలిజబెత్ రాణితో పెళ్లైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోషల్ మీడియాలో మహిళలను వలపన్నడంలో ఆరితేరాడు. తనది కూడా క్షత్రియ సామాజిక వర్గమేనని నమ్మించి యండగండికి చెందిన రేవతిని పదేళ్ల క్రితం ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత గణపవరం మండలానికి చెందిన సుష్మను కూడా వివాహం చేసుకున్నాడు.రేవతి అక్క పేరుతో ఉన్న ఆస్తిని కాజేయడానికి పథకం పన్నిన శ్రీధర్ వర్మకు అతని ఇద్దరు భార్యలు సహకరించారు. సొంత అక్కను బెదిరించి ఆస్తిని కాజేయాలనే ప్లాన్‌కు తులసి సోదరి రేవతి సహకరించింది. తులసికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఈ ఇంటికి క్షత్రియ సేవా సంఘం నుంచి నిర్మాణ సామాగ్రిని అందిస్తున్నట్టు నమ్మించారు.ఈ క్రమంలో శవాన్ని ఇంటికి పంపడం ద్వారా తులసిని భయపెట్టాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో శవం దొరక్క పోవడంతో ఒంటరిగా ఉంటున్న పర్లయ్యను హత్యచేసిన ఆ శవాన్ని చెక్కపెట్టెలో తులసి ఇంటికి పంపారు. మొదటి రోజు వర్షంలో కారు టైర్ పంక్చర్ కావడంతో పెట్టెను గాంధీనగరంలో ఇంట్లో ఉంచారు. మర్నాడు ఆటోలో యండగండిలోని తులసి ఇంటికి పార్సిల్ పంపారని ఉండి పోలీసులు వివరించారు.ఎలక్ట్రిక్ సామానులు వచ్చాయని చెక్క పెట్టె తెరిచిన తులసికి అందులో శవం చూసి భయపడింది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న శ్రీధర్ వర్మ శవం విషయం బయటకు పొక్కకుండా తాను చూసుకుంటానని ఆస్తి పత్రాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారు. సంతకాలు చేయకపోతే ఆమెను కూడా శవంగా మారుస్తామని బెదిరించారు. ఫోన్ కూడా లాగేసుకోవడంతో తులసి షాక్‌కు గురైంది. ఈ లోపు టాయ్‌లెట్‌కు వెళ్తానని చెప్పిన తులసి మరో ఫోన్ నుంచి గ్రామస్తులకు సమాచారం అందించింది. దీంతో తులసి ఇంటికి కొందరు చేరుకోవడంతో శ్రీధర్యండగొండిలో శవం విషయం బయటకు పొక్కడంతో శ్రీధర్ వర్మ మూడో భార్య సుష్మ, కూతురితో కలిసి కృష్ణాజిల్లా బంటుమిల్లి మీదుగా మంగినపూడి చేరుకున్నాడు. తాళ్లపాలెంలో కారును విడిచి గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. పోలీసులు ఆరా తీయడంతో గ్రామంలోకి కొత్తగా వచ్చిన వారి గురించి పోలీసులకు సమాచారం అందింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో కేసు మిస్టరీ వీడింది. నిందితుడి బ్యాంకు ఖాతాల్లో కోట్ల నగదు ఉండటం గుర్తించిన పోలీసులు అతని వ్యవహారాలపై ఆరా తీస్తున్నారు.

## ఏపీలో కేబినెట్ విస్తరణ.. ?



**విజయవాడ, డిసెంబర్ 28, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న ప్రచారం జరుగుతుంది. జనవరి ఎనిమిదో తేదీన ఈ విస్తరణ ఉండే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. ప్రస్తుతం ఉన్న కేబినెట్ నుంచి కొందరిని తప్పించి మరికొందరికి అవకాశం కల్పించడమే కాకుండా జనసేన నేత నాగబాబును కేబినెట్ లోకి చేర్చుకోవడం కూడా ఆరోజే జరుగుతుందని చెబుతున్నారు. నాగబాబుకు మంత్రి పదవి గ్యారంటీ అయింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్పష్టం చేశారు. ఐదు నెలల తర్వాత ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ పోస్టుల్లో ఒకటి నాగబాబుకు ఇవ్వడం కూడా దాదాపుగా ఖాయమైంది. అయితే నాగబాబు కేబినెట్ లో చేరిక వార్త చంద్రబాబు చెప్పి పక్షం రోజులు దాటుతున్నా ఇంకా ఆయన కేబినెట్ లో చేరలేదు.నాగబాబుతో పాటు మరికొందరిని మంత్రివర్గంలోకి చేర్చుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం కేబినెట్ లో 25 మంది ఉన్నప్పటికీ నలుగురైదుగురు ప్రస్తుత మంత్రి వర్గ సభ్యుల విషయంలో చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. వారి పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలను తెప్పించకుంటూ వారికి మార్కులను కూడా చంద్రబాబు కేటాయిస్తున్నారు. అట్టడుగున ఉన్న నలుగురిని మంత్రివర్గం నుంచి తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్న యోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నట్లు తెలిసింది. మంచి మార్కులు పొందిన వారిలో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, నారా లోకేష్, అనిత, నారాయణ, గొట్టిపాటి రవికుమార్ వంటి వారు ఉన్నారు. అయితే మిగిలిన వారిలో మరీ వీక్ గా నలుగురు ఉన్నట్లు చెబుతున్నారు.2024లో కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత చంద్రబాబు ఈసారి సీనియర్ నేతలను పక్కన పెట్టారు. తొలిసారి గెలిచినా వారికి మంత్రి పదవులను కట్టబెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చంద్రబాబు తన మంత్రి వర్గంలో తొలి సారి గెలిచిన వారికి మంత్రిపదవులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే సీనియర్లు కొంత అసంతృప్తితో ఉన్నప్పటికీ కక్కలేక, మింగలేక కొందరు నేతలు తమ అసంతృప్తిని అలాగే అణిచిపెట్టుకుని ఉన్నారు. సామాజికవర్గం పరంగా కూడా లెక్కలు వేసి మరీ చంద్రబాబు కేబినెట్ లోకి తీసుకున్నారు. అయితే కొందరు చంద్రబాబు అంచనాలకు అందుకోలేని విధంగా మంత్రులు పనితీరు ఉంది. అంతేకాకుండా వారి వల్ల పార్టీలో లేనిపోని తలనొప్పులు వస్తుండటం కూడా ఏరివేతకు కారణం అని చెబుతున్నారు.జిల్లాల్లో నేతలను సమన్వయం చేసుకోలేకపోవడంతో పాటు తమకు కేటాయించిన శాఖలపై పట్టు సంపాదించకపోవడంతో పాటు అధికార యంత్రాంగం పై కూడా గ్రిప్ లేకపోవడం కూడా చంద్రబాబు మంత్రులను తీసివేయడానికి కారణమని చెబుతున్నారు. కీలకమైన శాఖలను నమ్మి అప్పగించినా వారి పనితీరు సరిగా లేకపోవడంతో విమర్శలను ఎదుర్కొనాల్సి వస్తుందని కూడా అభిప్రాయపడుతున్నారు. అయితే ఏడాది కూడా గడవకముందే పనితీరును ఎలా బేరీజు వేస్తారన్న ప్రశ్నలు వినపడుతున్నాయి. అయితే మంత్రులను తొలగించకపోతే మిగిలిన వారిలో భయం ఉండదని, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు కూడా కొందరు స్పందించకపోవడంపై కూడా చంద్రబాబు అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## వైసీపీకి ఇంతియాజ్ రాజీనామా

**కర్నూలు, డిసెంబర్ 28, పెన్ పవర్:** వైఎస్ఆర్సీపీకి మరో గట్టి షాక్ తగిలింది. మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ పార్టీకి రాజీనామా చేశారు. తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. ఈ రాజీనామా వైసీపీ అధినేత జగన్ కు ఊహించని షాక్ లాంటిదే. ఎందుకంటే సిట్టింగ్ ఎమ్మెల్యేను కూడా కాదని అప్పటికప్పుడు ఆయనతో వీఆర్ఎస్ ఇప్పించి మరీ టిక్కెట్ ఇచ్చారు. కానీ ఆయన ఓడిపోయారు. ఇప్పుడు నేరుగా పార్టీకే గుడ్ బై చెప్పారు.ఇక నుంచి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని ఆయన చెబుతున్నారు.ఇంతియాజ్ అహ్మద్ గత ఎన్నికల నామినేషన్ల రోజు వరకూ ఐఏఎస్ ఆఫీసర్‌గా ఉన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు మంచి ప్రాధాన్యత లభించింది. కృష్ణా జిల్లాకు కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. రిటైర్మెంట్ దగ్గర పడటంతో ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని ఆసక్తి వ్యక్తం చేయగానే ఆయనకు జగన్ టిక్కెట్ కేటాయించారు. టిక్కెట్ల కోసం భారీ పోటీ ఉన్నప్పటికీ కర్నూలు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చారు. కర్నూలులో అప్పటికే వైసీపీలో రెండు వర్గాలు ఉన్నాయి. ఎస్వీ మోహన్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ వర్గాలున్నాయి. టికెట్ ఆశించిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు రాజ్యసభ సీటు ఇస్తానని, మాజీ ఎస్వీ మోహన్‌రెడ్డికి వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరులో నిర్వహించిన సిద్ధం సభలో హాఫీజ్ ఖాన్‌ను రెండేళ్లలో వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో రాజ్యసభకు పంపుతానని సీఎం జగన్ ప్రకటించారు. కానీ సమీప భవిష్యత్ లో మళ్లీ రాజ్యసభ స్థానాలు వైసీపీకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎన్నికల సమయంలోనే ఈ రెండు వర్గాలు పని చేయలేదు. దాంతో ఇంతియాజ్ అహ్మద్ ఘోరంగా ఓడిపోయారు. రాజకీయాలకు కొత్త అయిన ఇంతియాజ్ అహ్మద్ కు ప్రత్యేకమైన వర్గం అంటూ లేదు. దీంతో ఆయన కొన్ని రోజులుగా రాజకీయంగా ఏమీ చేయలేకపోతున్నారు. అటు ఎస్వీ మోహన్ రెడ్డి, ఇటు హాఫీజ్ ఖాన్ తమ అనుచరులతో తామే వైసీపీ ఇంచార్జ్ అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్నారు. పార్టీ వైపు నుంచి ఎన్నికల తర్వాత ఆయనకు రాజకీయంగా సహకారం లభించకపోవడం, జగన్ కూడా పట్టించుకోకపోవడంతో పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక రాజకీయాల్లో ఉండనని ఆయన చెబుతున్నారు. సామాజిక సేవాకార్యక్రమాలుచేస్తానని అంటున్నారు.

## వాక్‌విత్ నేషన్....

**కాకినాడ, డిసెంబర్ 28, పెన్ పవర్: :** కాకినాడ జేఎన్‌టీయూ అంటే సాంకేతిక విద్యలో తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరుంది. ఇక్కడ చదివిన ఎంతో మంది సాంకేతిక రంగాల్లో ఎనలేని కీర్తిని సంపాదించిన వారు ఉన్నారు. వేల మంది దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అటువంటి కీర్తిప్రతిష్టలు కలిగిన కాకినాడ జేఎన్‌టీయూ అభివృద్ధిపరంగానే కాకుండా యూనివర్సిటీ ప్రత్యేకతను చూపించేందుకు చాలా మంది పూర్వవిద్యార్థులు తమ భాగస్వామ్యపాత్ర పోషిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే దేశంలో ఏ విశ్వవిద్యాలయంలోనూ కనిపించని విధంగా జేఎన్‌టీయూకేలో ఏకంగా 194 దేశాల జాతీయపతాకాలను ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. జెనీవా, న్యూయార్క్, సియోల్, షాంఘై, శాంటోడోమింగ్‌లో ఉండే జాతీయ పతాకాల సమ్మేళనం మన దేశంలో తొలిసారిగా కాకినాడ జేఎన్‌టీయూలో ఏర్పాటుచేశారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీటిని ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆవిష్కరించారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో 194 దేశాల జెండాలు ఆవిష్కరించడం వెనుక పూర్వవిద్యార్థి, సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ బాదం సుందరరావు ఉన్నారు. ఆయన సహకారంతో వాక్‌విత్ నేషన్స్ పేరుతో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చేసిన ఈ జెండాల ఏర్పాటు వెనుక ఐక్యరాజ్యసమితి ప్రధాన కేంద్రం స్ఫూర్తి ఉందని వీసీ మురళీ కృష్ణ తెలిపారు. వసుదైక కుటుంబమే దీని ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. పూర్వ విద్యార్థిగా తన విశ్వవిద్యాలయంలో ఈ 194 జెండాల ప్రాజెక్టును సొంత ఖర్చుతో ఏర్పాటు చేసినట్లు పూర్వవిద్యార్థి బాదం సుందరరావు తెలిపారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 194 దేశాల జెండాల వివరాలు తెలుసుకునేలా ప్రతీ జెండా స్తంభానికి ఒక క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ సమైక్యత నినాదమే కాకుండా అంతర్జాతీయ ఐక్యరాజ్యసమితిలో గుర్తింపు పొందిన దేశ పరిస్థితులు తెలుసుకోవచ్చు. దీనిని స్కాన్ చేస్తే ఆ జెండా. దేశం వివరాలు అన్నీ తెలుసుకోవచ్చు. ఇవన్నీ సమాన ఎత్తులో ఏర్పాటు చేయడమే కాకుండా అక్షర క్రమంలో ఉంచారు. దేశ భౌగోళిక పరిస్థితి, కరెన్సీ, ఇతర వివరాలు ఈ క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 194 దేశాల జెండాలు రెపరెపలాడుతూ అందరి దృష్టిని ఆకర్షించాయి.

# నాలుగో టెస్టులో ఓడినా లేదా డ్రాగా ముగిసినా.. భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కి వెళ్లాలంటే.. సమీకరణాలు ఇలా!

- **ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో టాప్‌లో సఫారీలు**
- **రెండు, మూడు స్థానాల్లో వరుసగా ఆసీస్, భారత్**
- **బీజీటీ సిరీస్‌ను 3-1 తేడాతో గెలిస్తే నేరుగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కి భారత్**
- **ఒకవేళ రోహిత్ సేన ఈ మ్యాచులో ఓడిన లేదా డ్రాగా ముగిసిన మనకు ఛాన్స్**
- **పాక్, దక్షిణాఫ్రికా సిరీస్.. శ్రీలంకతో ఆస్ట్రేలియా ఆడే సిరీస్ ఫలితాల ద్వారా నిర్ధారణ**

మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో ఆతిథ్య జట్టుకు టీమిండియా దీటుగానే బదులిస్తోంది. మూడోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్ లో 9 వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో నితీశ్ కుమార్ రెడ్డి అజేయ శతకం (105 నాటౌట్)తో జట్టును ఆదుకున్నాడు. బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (50)తో కలిసి 127 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యం అందించాడు.

ఎనిమిది, తొమ్మిది స్థానాలలో బ్యాటింగ్‌కి వచ్చిన ఈ ద్వయం అద్భుతమైన పోరాటపటిమ, సమన్వయంతో ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. రెండో రోజు ఆట తర్వాత ఈ మ్యాచ్ భారత్ చేయి దాటిపోయిందనే అందరూ అనుకున్నారు. కానీ, మూడోరోజు నితీశ్, సుందర్ జోడీ అద్భుతంగా ఆడి, మ్యాచ్‌ను దాదాపు కాపాడారు. దాంతో భారత అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.

ఇదిలా ఉంటే... ఈ మ్యాచ్ ఫలితం ఇరు జట్లకు ఎంతో కీలకం. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌కి వెళ్లాలంటే ఆసీస్, భారత్‌కు ఈ మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా మొదటి స్థానంలో ఉంటే... ఆస్ట్రేలియా, భారత్ వరుసగా రెండు, మూడో స్థానంలో ఉన్నాయి. ఇక భారత్ ప్రస్తుతం జరుగుతున్న బీజీటీ సిరీస్‌ను 3-1 తేడాతో గెలిస్తే, ఎలాంటి సమీకరణాలతో పనిలేకుండా నేరుగా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌కి వెళుతుంది.

ఒకవేళ రోహిత్ సేన ఈ మ్యాచ్ లో ఓడినా లేదా డ్రాగా ముగిసినా కూడా మనకు డబ్ల్యూటీసీ ఫైనల్ వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కానీ, దానికోసం ఇతర జట్లు ఆడే రెండు టెస్టు సిరీస్‌ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అవి... ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్, దక్షిణాఫ్రికా సిరీస్ ఒకటి, త్వరలో శ్రీలంకతో ఆస్ట్రేలియా ఆడే సిరీస్ మరోకటి... ఈ టెస్టు సిరీస్ ల ఫలితాలు కీలకం కానున్నాయి.

ఈ రెండు సిరీస్‌ల ఫలితాల ఆధారంగా టీమిండియా ఫైనల్‌కి వెళ్లేందుకు కావాల్సిన సమీకరణాలను ఇప్పుడు మనం తెలుసుకుందాం...

ఇదివరకు చెప్పినట్టు బీజీటీలో భారత్ 3-1తో గెలిస్తే నేరుగా ఫైనల్‌కి వెళుతుంది.

ఒకవేళ భారత జట్టు 2-1తో గెలిస్తే... ఆసీస్‌తో జరిగే రెండు మ్యాచ్ ల సిరీస్‌లో శ్రీలంక తప్పనిసరిగా ఒక మ్యాచ్ డ్రా చేయాల్సి ఉంటుంది. లేదా దక్షిణాఫ్రికాపై పాకిస్థాన్ రెండు మ్యాచ్ ల సిరీస్‌ను గెలవాల్సిందే.

ఒకవేళ టీమిండియా 2-2తో సమం చేసిన పక్షంలో శ్రీలంక తప్పనిసరిగా ఆసీస్‌ను ఓడించాల్సి ఉంటుంది. లేదా దక్షిణాఫ్రికాపై పాక్ 2-0 తేడాతో సిరీస్ విజయం సాధించాలి.

ఒకవేళ భారత్ 1-1 తో సమం చేస్తే... ఆస్ట్రేలియాను శ్రీలంక 1-0 తేడాతో ఓడించాలి. లేదా పాకిస్థాన్.. సఫారీలపై 2-0తో సిరీస్ గెలవాలి.

ఒకవేళ భారత్ బీజీటీ సిరీస్‌ను కోల్పోతే మాత్రం డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి తప్పుకున్నట్లే. అప్పుడు ఆసీస్, దక్షిణాఫ్రికా ఫైనల్‌కి వెళతాయి.



# తెలుగుతేజం నితీశ్ రెడ్డి శతకం... భారత క్రికెట్ దిగ్గజం గవాస్కర్ స్టాండింగ్ ఒవేషన్...

**మెల్‌బోర్న్‌లో సెంచరీతో అదరగొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి**

**తెలుగు తేజంపై ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు**

**నితీశ్ సెంచరీ చేయగానే సునీల్ గవాస్కర్ స్టాండింగ్ ఒవేషన్**

**భారత క్రికెట్‌కు దొరికిన మరో టాలెంటెడ్ ప్లేయర్ అని కితాబు**





ప్రతిష్ఠాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో సెంచరీతో అదరగొట్టిన 21 ఏళ్ల నితీశ్ కుమార్ రెడ్డి పేరు ఇప్పుడు మార్మోగిపోతోంది. బాక్సింగ్ డే టెస్టు మూడో రోజు ఆటలో ఇదే హైలైట్ గా నిలిచింది. కెరీర్‌లో నాలుగో టెస్టు ఆడుతున్న యువ ఆటగాడు... ఆతిథ్య జట్టు బలమైన బౌలింగ్ లైనప్ ను ఎదుర్కొని మరీ శతకం బాదడం విశేషం. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ వచ్చి, అది కూడా జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఈ సెంచరీ సాధించడం నిజంగా అభినందనీయం.అందుకే ఈ తెలుగుతేజంపై ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. ఇక నితీశ్ కుమార్ రెడ్డి బౌండరీతో శతకం పూర్తి చేయగానే కామెంట్రీ బాక్స్ లో ఉన్న భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చాడు. ఉత్సాహంతో ఉరకలేస్తూ కామెంట్రీ చెప్పాడు. సూపర్బ్ ఇన్నింగ్స్.. భారత క్రికెట్‌కు దొరికిన మరో యంగ్ టాలెంట్ అంటూ ప్రశంసించాడు. గ్రేట్ టాలెంట్, టెంపర్ మెంట్‌ల కలయిక అని కితాబిచ్చాడు. ఇలాంటి సెంచరీలు నితీశ్ రెడ్డి మరిన్ని సాధించాలని లిటిల్ మాస్టర్ ఆకాంక్షించాడు.

# మొదటి టెస్టు నుంచే నన్ను ఆకట్టుకున్నాడు: నితీశ్ టెస్టు సెంచరీపై సచిన్ స్పందన



**ఆస్ట్రేలియాపై సెంచరీ కొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి**

**సర్వత్రా ప్రశంసల వర్షం**

**నితీశ్ ను అభినందించిన సచిన్**

**ప్రశాంతంగా ఆడుతూనే టెంపర్ మెంట్ చూపిస్తున్నాడని కితాబు**

పెద్దగా అంతర్జాతీయ అనుభవం లేనప్పటికీ, ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టుపై టెస్టుల్లో సెంచరీ సాధించడం ద్వారా తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి తన గురించి అందరూ మాట్లాడుకునేలా చేశాడు. టీమిండియా-ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగో టెస్టు మూడో రోజు ఆటలో నితీశ్ సెంచరీనే హైలైట్. ఎనిమిదో స్థానంలో వచ్చి సెంచరీ సాధించడం ఈ ఆంధ్రా క్రికెటర్ దృఢ సంకల్పాన్ని చాటుతోంది. కాగా, నితీశ్ కు టెస్టుల్లో ఇదే తొలి సెంచరీ. దాంతో అతడిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. నితీశ్ ఘనతపై భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ కూడా స్పందించాడు. నితీశ్ ఆడిన ఈ ఇన్నింగ్స్ గుర్తుండిపోతుందని ట్వీట్ చేశాడు. "నితీశ్ నన్ను మొదటి నుంచి ఆకట్టుకున్నాడు. ప్రశాంతంగా ఆడుతూనే, తన టెంపర్ మెంట్ ను చూపిస్తున్నాడు. ఇవాళ తన ఆటతీరును ఉన్నతస్థాయికి తీసుకెళ్లి సిరీస్ లో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇక, వాషింగ్టన్ సుందర్ శక్తిమేర అద్భుతంగా ఆడి సహకారం అందించాడు... ఇద్దరూ బాగా ఆడారు" అంటూ సచిన్ అభినందించాడు.

# బోయపాటి నెక్ట్స్ టార్గెట్ కూడా ఫిక్సైపోయిందా!



నలుపు రంగులో ప్రగ్యా జైస్వాల్ అద్భుతమైన పోజులు



బోయపాటి తదుపరి చిత్రం కూడా కన్ఫమ్ అయినట్లేనా? అదీ నందమూరి నటసింహంతోనే ఉండబోతుందా? అంటే అవుననే తెలుస్తోంది. కాకపోతే ఇందులో కాస్త మార్పు రాబోతుంది. బాలయ్యతో పాటు మెగాస్టార్ చిరంజీవి కూడా జాయిన్ అయ్యే అవకాశం ఉంది. ఇద్దరి కాంబినేషన్ లో భారీ మల్టీస్టారర్ కు చిరంజీవి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిన సంగతి తెలిసిందే. పబ్లిక్ గానే బోయపాటిని ఇద్దరి ఇమేజ్ కి తగ్గ స్టోరీ సిద్ధం చేయమని చెప్పేసారు.

ఇంత గొప్ప అవకాశం కేవలం బోయపాటి కి మాత్రమే చిరంజీవి అందించారు. ఎంతో మంది డైరెక్టర్లు ఉన్నా? వాళ్లందర్నీ పక్కనబెట్టి ఆ ఛాన్స్ నీదే అంటూ పబ్లిక్ గా చెప్పారు. మరి ఈ ఛాన్స్ బోయపాటి ఎందుకు వదులు కుంటాడు? బాలయ్యకే కొత్త ఇమేజ్ ని తీసుకొచ్చిన బోయపాటి ఆ ఇద్దర్నీ తెరపై చూపించడానికి ఇంకే స్థాయిలో కసరత్తులు చేస్తాడు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరి మాస్ ఇమేజ్ కి తగ్గ స్టోరీ సిద్ధం చేయడం అంత సులభం కాదు.

దీనిపై బోయపాటి చాలా వర్క్ చేయాల్సి ఉంటుంది. అయితే 'అఖండ తాంవడం' తర్వాత ఈప్రాజెక్ట్ పై బోయపాటి పని మొదలు పెడతారని ఆయన సన్నిహిత వర్గాల సమాచారం.

ప్రస్తుతం బాలయ్య హీరోగా 'అఖండ తావడం' మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. ఆ సినిమా సెట్స్ లో ఉంది. ఈ సినిమాతో పెద్ద హిట్ కొట్టాలన్నది బోయపాటి ప్లాన్ . ఇంతవరకూ ఆ కాంబినేషన్ ఫెయిలైంది లేదు. సింహా, లెజెండ్, అఖండ మూడు చిత్రాలతో హ్యాట్రిక్ నమోదు చేసారు. 'అఖండ తాండవం'తో నాల్గవ హిట్ ఇచ్చి డబుల్ హ్యాట్రిక్ లైన్ వేయాలని చూస్తున్నారు. అఖండ తావడం షూటింగ్ సహా అన్ని పనులు పూర్తి చేసి దసరాకి రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అనంతరం బోయపాటి చిరు-బాలయ్య ప్రాజెక్ట్ పనులు మొదలు పెట్టే అవకాశం ఉంది. అటుపై చిత్రాన్ని 2026లో రిలీజ్ చేసే ఛాన్స్ ఉంది.



మాళవికా మోహనన్ లుక్స్ మెస్మరైజింగ్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com